# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

MHR TV

www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 356 | శనివారం, 23 ఆగస్టు 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



# మీ సేవా సెంటర్ @బెట్టింగ్ సెంటర్..!

భైంసాలో ఏడాది కాలంగా సాగిన బెట్టింగ్ రాకెట్ బహిర్గతం

మీ సేవా సెంటర్ ముసుగులో Allpannel.com ద్వారా దందా

నిందితుడి వద్ద భారీ నగదు, బంగారం, ఫేక్ డాక్యుమెంట్స్ సీజ్

బెట్టింగ్ ముఠాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన పోలీసులు




**హైదరాబాద్ ఆగస్టు 22 (ప్రజాస్వరం):**

నిర్మల్ జిల్లా పోలీసులు భైంసా ప్రాంతంలో జరుగుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాపై గట్టి దాడి చేసి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేశారు. ఏడాది కాలంగా భైంసాను అడ్డాగా చేసుకుని ఈ అక్రమ కార్యకలాపాలను నడిపిస్తున్న సయ్యద్ ఆజమ్‌ను గురువారం రాత్రి ఓవైసీ నగర్‌లోని ఓ ఆలయం సమీపంలో మెరుపుదాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల వెల్లడించిన వివరాల ప్రకారం, ఆజమ్ మీ సేవా సెంటర్ ముసుగులో Allpannel.com అనే యాప్ ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. బాధితుల నుండి బ్యాంక్ ఖాతాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ యాక్సెస్ తీసుకుని వారికి ప్రతి నెలా కొంత డబ్బు ఇస్తానని నమ్మబలికి ట్రాన్సాక్షన్లు తన ఆధీనంలో పెట్టుకున్నాడు. బెట్టింగ్‌లో వచ్చిన డబ్బులను అవాలా రూపంలో ఇతర ఖాతాలకు మళ్లించడంతో పాటు నకిలీ ఐటీ రిటర్న్స్, ఫేక్ ఇన్కమ్ సర్టిఫికెట్లు తయారు చేసి ఈ దందాను కొనసాగించినట్టు పోలీసులు గుర్తించారు.

దాడిలో పోలీసులు నిందితుడి వద్ద నుండి 16.3 లక్షల రూపాయల ..మిగతా 2లో

## హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావుకు చుక్కెదురు

కాళేశ్వరం నివేదికపై కేసీఆర్, హరీశ్ కు ఎదురుదెబ్బ

పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ పై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని స్పష్టం చేసిన హైకోర్టు




2

## కేటీఆర్ క్యారెక్టర్ లేనివాడు..

కేటీఆర్‌పై జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

కేటీఆర్‌కి రాజకీయ మెచ్యూరిటీ లేదు

అమెరికాలో జీతం మీదనే బతికేవాడు

థర్డ్ క్లాస్ అనడానికి మనసు ఎట్లా వచ్చింది




**హైదరాబాద్ ఆగస్టు 22 (ప్రజాస్వరం):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీపై మాట్లాడిన కేటీఆర్ క్యారెక్టర్ లేనివాడు అంటూ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నీకు ఇప్పుడు చిల్లర పార్టీ అయ్యిందా? అని ఫైర్ అయ్యారు. తెలంగాణ ఇచ్చాక సోనియా గాంధీ ఇంటికి వెళ్లి కలిశారు కదా?, అప్పుడు చిల్లర అనిపించలేదా? అని విమర్శించారు. సోనియా గాంధీ వల్లనే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ సభలో చెప్పారు, ఆ మాట నువ్వు మర్చిపోయావా? అంటూ కేటీఆర్‌పై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ థర్డ్ క్లాస్ పార్టీ అయితే.. ఆ పార్టీ నుంచే పాఠాలు నేర్చుకున్న మీ నాన్న కూడా థర్డ్ క్లాసే కదా? అని ..మిగతా 2లో

## సెలవొస్తే.. సిటీబస్సు ట్రిప్పులకూ బ్రేక్!

### వాన కురిసే వేళా అంతే...

ప్రయాణికుల రద్దీ తక్కువున్న సమయంలో సర్వీసుల సంఖ్య కుదించాలని నిర్ణయించిన ఆర్టీసీ

డిపో మేనేజర్లకు మౌఖిక ఆదేశాలు.. గత ఆదివారం నుంచి అమలు షురూ

ఆరోజు రాత్రి బస్సుల జాడ లేక గంటల తరబడి రోడ్లపైనే గడిపిన జనం

డీజిల్ ఖర్చును తగ్గించుకునేందుకు ఆర్టీసీ ఆరాటం

లాభనష్టాల ఆధారంగా బస్సులు నడిపే నిర్ణయం



2

## ఈ నెల 25న తెలంగాణ మంత్రివర్గ సమావేశం..

స్థానికసంస్థల ఎన్నికలపై నిర్ణయం!!

2

## చట్టానికి ఎవరూ చుట్టాలు కాదు

50 గంటల అరెస్ట్‌తో ఉద్యోగాలే పోతున్నాయి

పీఎం, సీఎంలకు ఊరట ఎందుకు?

కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు ఉంటే జైల్లో.. లేదంటే బెయిల్‌పై..

ప్రధాని నరేంద్ర మోదీ సెటైర్లు



**పాట్నా, హైదరాబాద్ ఆగస్టు 22 (ప్రజాస్వరం):**

జైలులో ఉన్న నేతల పదవి ఊస్టింగ్‌కు సంబంధంచిన బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకిచడంపై ప్రధాని మోదీ మండిపడ్డారు. శుక్రవారం బిహార్‌లోని గయాజీలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు ఉంటే జైల్లో, లేదంటే బెయిల్‌పై బయట ఉంటారని ఎద్దేవా చేశారు. అందుకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు తాము బిల్లును ప్రవేశపెడితే విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. 50 గంటలు జైలులో ..మిగతా 2లో

## పదేళ్లు ఉద్యోగాలు ఇవ్వలేదు.. పైగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు!

బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి ఉద్యోగాలు ఇవ్వలేదు

బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు

రెప్పపాటు కూడా విద్యుత్ పోకుండా చర్యలు చేపడుతున్నాం

500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తున్నాం



**హైదరాబాద్ ఆగస్టు 22 (ప్రజాస్వరం):**

బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి ఉద్యోగాలు ఇవ్వలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుంటే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. బీఆర్ఎస్ వాళ్లను చూసి నవ్వాలో, ఏడవాలో ..మిగతా 2లో

## ఉప రాష్ట్రపతి అభ్యర్థి పై షా సంచలన ఆరోపణలు

**న్యూఢిల్లీ ఆగస్టు 22 (ప్రజాస్వరం):**

ఉపరాష్ట్రపతి ఎన్నికల వేళ రాజకీయాలు వేడెక్కాయి. విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిపై ..మిగతా 2లో

ఉపరాష్ట్రపతి ఎన్నికల వేళ వేడెక్కిన రాజకీయాలు

జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి మద్దతిచ్చారని షా తీవ్ర ఆరోపణ

ఆయన ఇచ్చిన సల్వా జుడుం తీర్పు వల్లే నక్సలిజం పెరిగిందని వెల్లడి

ఆ తీర్పు లేకపోతే 2020 నాటికే నక్సలిజం అంతమయ్యేదని వ్యాఖ్య

సుప్రీంకోర్టు వేదికను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని విమర్శ



2



# ఇది కదా నాయకత్వం అంటే.. ముందు చూపు అంటే..!

కేసీఆర్ హయాంలో ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కలేదు

కాంగ్రెస్ పాలనలో మాత్రం అన్నదాతలు అరిగోస పడుతున్నారు

అసమర్థులు రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు.. కన్నీళ్లు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ ఆగస్టు 22 (ప్రజాస్వరం):**

కేసీఆర్ హయాంలో ఏనాడూ కూడా రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కలేదు. ధర్నా చేయలేదు. కానీ కాంగ్రెస్ పాలనలో మాత్రం అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క యూరియా బస్తా కోసం వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు అన్నదాతలు. ఈ పరిస్థితులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ.. కేసీఆర్ పాలనను గుర్తు చేశారు. ఇది కదా నాయకత్వం అంటే.. ఇది కదా ముందు చూపు అంటే అని కేటీఆర్ పేర్కొంటూ.. కేసీఆర్ హయాంలో రైతులకు జరిగిన మేలును వివరించారు. నాడు సీఎం కేసీఆర్ సారథ్యంలో.. యూరియాను టైంకు తెప్పించడానికి ముందస్తుగా ఎన్నో ప్రణాళికలు చేసేవారు. అడుగడుగునా కసరత్తులు నిర్వహించి తెప్పించారు. వ్యవసాయ అధికారులతో కేసీఆర్ వరుస సమీక్షలు ..మిగతా 2లో

# హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావుకు చుక్కెదురు

- కాళేశ్వరం నివేదికపై కేసీఆర్, హరీశ్ కు ఎదురుదెబ్బ
- పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ పై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ
- మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని స్పష్టం చేసిన హైకోర్టు

హైదరాబాద్ ఆగస్టు 22 (ప్రజాస్వరం):

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌పై తక్షణమే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది.

ఈ పిటిషన్లపై వాదనలు విన్న హైకోర్టు... పిటిషనర్లు కోరినట్లుగా స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. మూడు వారాల్లోగా ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. దీంతో బీఆర్ఎస్ నేతలకు తాత్కాలికంగా నిరాశే తప్పలేదు.

విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) వాదనలు వినిపించారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను తొలుత శాసనసభలో ప్రవేశపెడతామని, ఆ తర్వాతే దాని ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన కోర్టుకు వివరించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయస్థానానికి స్పష్టంగా తెలియజేశారు.

మరోవైపు, ఈ నివేదిక ఇప్పటికే పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్నట్లయితే, దానిని తక్షణమే తొలగించాలని కూడా ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించడం గమనార్హం.





# సెలవొస్తే.. సిటీబస్సు ట్రిప్పులకూ బ్రేక్!

**రామంతాపూర్‌కు చెందిన ఆంజనేయులు ఇంటికి వెళ్లేందుకు ఆదివారం రాత్రి 8.30 గంటలకు బంజారాహిల్స్ నుంచి బయలుదేరి 9 గంటలకు లక్డీకాపూల్ చేరుకున్నారు. రాత్రి 10.30 వరకు ఎదురుచూసినా రామంతాపూర్ బస్సు రాలేదు. అప్పటికే అక్కడ 30 మంది వరకు ప్రయాణికులు జమయ్యారు.**

**ఓవైపు బోరున వర్షం కురుస్తుండటం, ఇటు బస్సు రాకపోవటంతో వారి అవస్థలు వర్ణనాతీతం. రెండుగంటలపాటు ఎదురుచూస్తే గానీ బస్సు రాలేదు. ఇది ఒక్క ఆంజనేయులుకు ఎదురైన పరిస్థితే కాదు.. ఆదివారం సాయంత్రం నుంచి నగరవ్యాప్తంగా వేలాదిమంది ప్రయాణికులు ఎదుర్కొన్న దుస్థితి. వర్షం కురిసే సమయం...సెలవు రోజుల్లో ఇదే పరిస్థితి ఎదురుకానుంది.**

- వాన కురిసే వేళా అంతే...
- ప్రయాణికుల రద్దీ తక్కువున్న సమయంలో సర్వీసుల సంఖ్య కుదించాలని నిర్ణయించిన ఆర్టీసీ
- డిపో మేనేజర్లకు మౌఖిక ఆదేశాలు.. గత ఆదివారం నుంచి అమలు షురూ
- ఆరోజు రాత్రి బస్సుల జాడ లేక గంటల తరబడి రోడ్లపైనే గడిపిన జనం
- డీజిల్ ఖర్చును తగ్గించుకునేందుకు ఆర్టీసీ ఆరాటం
- లాభనష్టాల ఆధారంగా బస్సులు నడిపే నిర్ణయం

హైదరాబాద్ ఆగస్టు 22 (ప్రజాస్వరం):

ఆదాయం పెంపుపై దృష్టి సారిస్తున్న ఆర్టీసీ.. మరోవైపు ఖర్చులను కూడా నియంత్రించుకునే పనిలో నిమగ్నమైంది. ఇప్పుడు ఈ ఆలోచన నగరవాసులపై పెద్ద ప్రభావమే చూపబోతోంది. వానలు కురిసిన సమయంలో, పండుగల వేళ రద్దీ అంతంతమాత్రమే ఉంటోందని భావిస్తున్న ఆర్టీసీ, ఆయా సమయాల్లో బస్సులను పరిమితంగానే నడపాలని యోచిస్తోంది.

ఇటీవల వర్షం కురిసిన ఓ రోజు కొన్ని ప్రాంతాల్లో తక్కువ రద్దీతో బస్సులు తిరగటాన్ని గుర్తించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఆ సమయంలో ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉంటుందని, అలాంటి సమయాల్లో బస్సుల సంఖ్య తగ్గించి తిప్పాలని డిపో మేనేజర్లను మౌఖికంగా ఆదేశించారు. శనివారం మరోసారి పరిశీలించిన అధికారులు, రద్దీ తక్కువగా ఉన్నా.. ఎక్కువ బస్సులు ఎందుకు తిప్పుతున్నారంటూ సిటీ అధికారులను ప్రశ్నించారు. దీంతో సంబంధిత అధికారులు అందరు డిపో మేనేజర్లకు మరోసారి సీరియస్‌గా మౌఖికంగానే ఆదేశాలిచ్చారు.

ఆదివారం నుంచి బస్సుల సంఖ్య తగ్గించాలని పేర్కొన్నారు. దీంతో డిపో మేనేజర్లు ఆదివారం దాదాపు 20 శాతం బస్సు ట్రిప్పులను తగ్గించేశారు. రాత్రి పూట ఎక్కువ బస్సులను రద్దు చేశారు. రాత్రి 9 తర్వాత సింహభాగం బస్సులను డిపోలకే పరిమితం చేసి అతి పరిమితంగా నడిపారు. దీంతో ఆ సమయంలో రోడ్లపై మిగిలిపోయిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది.

**2019లోనూ ఇదే తరహాలో...**

2019లో దీర్ఘకాల సమ్మె తర్వాత ప్రభుత్వం ఆర్టీసీ తీరుపై సమీక్షించిన సమయంలోనూ ఇదే తరహా నిర్ణయం జరిగింది. నగరంలో రద్దీ లేని సమయాల్లో కూడా ఎక్కువ సంఖ్యలో బస్సులు తిప్పుతున్నారని, ఇది డీజిల్ దుబారాకు కారణమవుతోందని పేర్కొన్న ప్రభుత్వం, నగరంలో 2 వేల బస్సులు తగ్గించాలని ఆదేశాలిచ్చింది. అప్పుడు అంతమేర బస్సులను రద్దు చేసిన ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోంది.

నగరంలో కేవలం 3 వేల బస్సులు మాత్రమే ఉండగా, హైదరాబాద్ నగర జనాభాతో సమంగా ఉన్న బెంగళూరులో ప్రస్తుతం 8,900 సిటీ బస్సులు తిరుగుతున్నాయి. అసలే తక్కువ బస్సులున్న తరుణంలో ఒకేసారి 2 వేల బస్సులు తగ్గించటంతో ఏర్పడిన కొరత ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ తరుణంలో రద్దీ తక్కువగా ఉన్న సమయంలో ఆ సంఖ్యను మరింత తగ్గించి నడిపితే, రోడ్లపై ఉన్న ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి వస్తుంది. కానీ, ప్రయాణికుల అవస్థల కంటే ఆదాయమే ముఖ్యమన్న తరహాలో ఆర్టీసీ వ్యవహరిస్తుండటం ఇప్పుడు నగర ప్రయాణికులకు శాపంగా మారబోతోంది. గత్యంతరం లేని స్థితిలో, జేబులో బస్‌పాస్ ఉండి కూడా ఆటోలు, క్యాబ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. మహాలక్ష్మి పథకం ఉండి కూడా మహిళలు భారీ మొత్తం చెల్లించి ఆటోలు, క్యాబ్‌లలో వెళ్లాల్సి వస్తోంది.



### రద్దీ లేకుంటే రద్దు చేయమన్నారు

**రోడ్లపై ప్రయాణికుల సంఖ్యను గమనిస్తూ తక్కువగా ఉన్న రోజుల్లో 10 నుంచి 15 శాతం సర్వీసులు నడపొద్దని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు ఆదివారం మా డిపో పరిధిలో సాయంత్రం తర్వాత కొన్ని సర్వీసులను రద్దు చేశారు. సెలవు రోజుల్లో ఇలాగే కొనసాగించాలని సూచించారు.** - ఓ కండక్టర్

### ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు

**రాత్రి 9:30 గంటల సమయంలో బస్సుల కోసం గంటన్నర నుంచి రెండు గంటల పాటు ఎదురుచూసే పరిస్థితిని నేను ఎప్పుడూ చూడలేదు. ఆ సమయంలో 113 నంబరు బస్సు కోసం గమ్యం యాప్ చూస్తే వాటి జాడే లేదు. రాత్రి పదిన్నర సమయంలో ఒక బస్‌స్టాప్‌లో 30 మంది ప్రయాణికులు జమయ్యారంటే సర్వీసుకు సర్వీసుకు మధ్య విరామం ఎంత ఎక్కువగా ఉందో అవగతమవుతుంది.** - ఆంజనేయులు, రామంతాపూర్

# కేటీఆర్ క్యారెక్టర్ లేనివాడు..

మొదటిపేజీ తరువాయి

జగ్గారెడ్డి అన్నారు.

జగ్గారెడ్డి ఈరోజు హైదరాబాద్‌లో మీడియా మాట్లాడుతూ... 'తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ నీకు (కేటీఆర్) ఇప్పుడు చిల్లర పార్టీ అయ్యిందా?. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తర్వాత సోనియా గాంధీ ఇంటికి వెళ్లి కలిశారు కదా, అప్పుడు చిల్లర అనిపించలేదా?. అప్పుడు అనిపించనిది.. ఇప్పుడు ఎందుకు అనిపిస్తుంది?. మీ కుటుంబం వెలిగిపోతుంది అంటే దానికి కారణం కాంగ్రెస్ కాదా?. కాంగ్రెస్ థర్డ్ క్లాస్ అయితే.. మీ నాన్న కూడా థర్డ్ క్లాసే కదా?. థర్డ్ క్లాస్ నుంచే కదా.. నువ్వు రాజకీయ నాయకుడివి అయ్యింది. వందకోట్ల ప్రజలకు స్వతంత్రం తెచ్చిన కాంగ్రెస్ పార్టీని థర్డ్ క్లాస్ అనడానికి మనసు ఎట్లా వచ్చింది. కేటీఆర్.. కాంగ్రెస్ అంటే ఏందో కేసీఆర్‌ని అడిగి తెలుసుకో. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే.. మీ కుటుంబం వేల కోట్లు సంపాదించే అవకాశం ఉండకపోయేది. అమెరికాలో జీతం మీదనే బతికే వాడివి నువ్వు. నీ కుటుంబం ఏం చేసి బతుకుతుండేనో మరి' అని ఫైర్ అయ్యారు.

'సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా పెడితే.. తెలంగాణ బిడ్డగా.. ఆయనకు ఓటేయాల్సింది పోయి.. ఉల్టా కాంగ్రెస్ మీదనే ఆరోపణలు చేస్తావా?. కేటీఆర్, కేసీఆర్‌వి అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట. కేటీఆర్ పదేళ్లు మంత్రిగా ఉన్నా రాజకీయ మెచ్యూరిటీ రాలేదు, అందుకే మాటకు దొర్లుతున్నాడు. కేటీఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నాడు. కేటీఆర్ తాతనానమ్మ బతికి ఉంటే.. ఆయన్ను పిలిచి తిట్టే వారు. అసవరం అనుకుంటే చెంప మీద కొట్టేవాళ్ళు. కేటీఆర్‌కు త్యాగాల విలువ తెలియదు. వీళ్ళంతా డ్రామా ఆర్టిస్టులు. కేసీఆర్ 11 రోజులు దీక్ష చేయగలడా?. తిని దీక్ష చేసినా.. యాక్సెప్ట్ చేసే వాళ్ళు. అప్పుడు పరిస్థితి అది. కేసీఆర్ దీక్ష అంత కాంగ్రెస్ డిజైన్. మా వాళ్ళ బాధ మా వాళ్ళది.. జానారెడ్డి ముందుండి చేశారు' అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

'తెలంగాణ వచ్చి ప్రజలకు బెనిఫిట్ ఏమైందో తెలియదు కానీ.. కేసీఆర్ కుటుంబానికి మాత్రం బాగా బెనిఫిట్ అయ్యింది. కేటీఆర్‌కి రాజకీయ మెచ్యూరిటీ లేదు. కేటీఆర్ తొందరపడి మాట్లాడి కిషన్ రెడ్డికి అవకాశం ఇచ్చినట్టు అయ్యింది. సచివాలయంలో నేను రివ్యూ చేశా..దానిపై బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తుంది. నేను ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా మొగొన్నే. సచివాలయంలో దందా చేస్తే తప్పు కానీ.. ప్రజల కోసం సమీక్ష చేస్తే తప్పా. మళ్ళీ మళ్ళీ చేస్తా. మీ లెక్క కొడుకు, అల్లుడు, బిడ్డలు పంచుకున్నట్టు పంచుకున్నానా?. గెలుపు, ఓటమి కాదు.. నేను కూడా రాజకీయ నాయకున్నే కదా?. కిషన్ రెడ్డి మంచోడు, సౌమ్యుడు. ప్రాబ్లం ఏంటంటే.. ఆయన కూడా స్క్రిప్ట్ లీడర్. రాసి ఇచ్చింది చదువుతాడు.. పొలిటికల్ స్పీచ్లు ఇవ్వలేడు. యూరియా మీరు ఇవ్వకుండా.. మాట్లాడితే ఏం లాభం. కేంద్రమే ఇవ్వాలి యూరియా. వేల కోట్లు రైతులకు ఇచ్చే రేవంత్ రెడ్డికి ఎరువులు ఇవ్వడానికి ప్రభుత్వానికి ఏదైనా ఇబ్బందా?' అని జగ్గారెడ్డి ప్రశ్నించారు.







# మీ సేవా సెంటర్ @బెట్టింగ్ సెంటర్..!

మొదటిపేజీ తరువాయి

నగదు, సుమారు 385 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు బంగారు బిస్కెట్లు, 21 ఆస్తి పత్రాలు, మొబైల్ ఫోన్లు, ఎనిమిది ఏటీఎం కార్డులు, అలాగే బాధితుల పాన్-ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. జూదం, బెట్టింగ్ వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలబోమని ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి ముఠాలకు లోబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్టు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.




# ఉప రాష్ట్రపతి అభ్యర్థి పై షా సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంచలన ఆరోపణలు చేశారు. సుదర్శన్ రెడ్డి తన తీర్పు ద్వారా నక్సలిజానికి పరోక్షంగా ఊతమిచ్చారని, ఆయన నక్సలిజం మద్దతుదారు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

శుక్రవారం ఢిల్లీలో జరిగిన మనోరమ న్యూస్ కాన్‌క్లేవ్‌లో అమిత్ షా మాట్లాడుతూ, "జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి సహకరించిన వ్యక్తి. ఆయన ఇచ్చిన సల్వా జుడుం తీర్పు వల్లే దేశంలో నక్సల్ ఉగ్రవాదం ఏళ్లపాటు కొనసాగింది. ఒకవేళ ఆ తీర్పు రాకపోయి ఉంటే, 2020 నాటికే నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టేవాళ్లం," అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వామపక్షాల ఒత్తిడికి తలొగ్గి ఇలాంటి వ్యక్తిని అభ్యర్థిగా నిలబెట్టిందని, సుప్రీంకోర్టు వంటి పవిత్రమైన వేదికను దుర్వినియోగం చేసిందని ఆయన విమర్శించారు.

**ఏమిటీ సల్వా జుడుం తీర్పు?**

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులను ఎదుర్కోవడానికి 2005లో అప్పటి ప్రభుత్వం గిరిజన యువతతో 'సల్వా జుడుం' పేరుతో ఒక పౌర సైన్యాన్ని ఏర్పాటు చేసింది. వీరికి ఆయుధ శిక్షణ ఇచ్చి స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా నియమించింది. అయితే, ఈ దళంపై మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం 2011లో చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. పౌరులకు ఆయుధాలిచ్చి ప్రభుత్వమే హింసను ప్రోత్సహించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేస్తూ సల్వా జుడుంను రద్దు చేసింది.

కాగా, అధికార ఎన్డీఏ కూటమి తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను బరిలోకి దింపిన విషయం తెలిసిందే. ఆయన తమిళనాడుకు చెందిన సీనియర్ బీజేపీ నేత.



# ఈ నెల 25న తెలంగాణ మంత్రివర్గ సమావేశం..

- స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం!!
- పంచాయతీ ఎన్నికల కోసం సెప్టెంబర్ 30 గడువు విధించిన హైకోర్టు
- ఎన్నికల్లో రిజర్వేషన్లు, ఎన్నికలపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం
- రిజర్వేషన్లు రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం ఇచ్చే అవకాశం

హైదరాబాద్ ఆగస్టు 22 (ప్రజాస్వరం):

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల 25న సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనుంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి హైకోర్టు విధించిన గడువు సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఈ మంత్రివర్గ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, ఎన్నికల నిర్వహణపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఈ శనివారం జరగనున్న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహం ఖరారు కానుంది. రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకుని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసే అవకాశం ఉంది.



# పదేళ్లు ఉద్యోగాలు ఇవ్వలేదు.. పైగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు!

మొదటిపేజీ తరువాయి

అర్థం కావడం లేదని విమర్శించారు. మెకానికల్ లైఫ్ కాదు.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మానవ సంబంధాలే ఉండాలని తాము చూస్తున్నామన్నారు. ఉద్యోగ అవకాశాల ద్వారా పేదరికాన్ని జయించవచ్చని పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధులతో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెప్పపాటు కూడా విద్యుత్ పోకుండా చర్యలు చేపడుతున్నాం అని భట్టి చెప్పుకొచ్చారు.

హైదరాబాద్‌లో నిర్వహించిన ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. 'విద్య ద్వారా సామాజిక, ఆర్థిక వెనుకబాటును జయించవచ్చు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం. 2600 మంది విద్యార్థులు చదువుకునేలా వసతులు కల్పిస్తున్నాము. గురుకులాల విషయంలో ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది. ఆనాడు భూములు ఇచ్చింది ఇందిరమ్మే. ఇప్పుడు మీకు ఉద్యోగాలు ఇస్తుంది మా ప్రభుత్వమే. 2013లో భూసేకరణ లాంటి గొప్ప చట్టం తెచ్చారు. ఆ చట్టం వల్లనే ఇప్పుడు మీకు న్యాయం చేస్తున్నాం. 500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తున్నాం' అని భట్టి చెప్పారు.

'యాదాద్రి పవర్ ప్లాంట్‌పై ఎన్ని సార్లు సమీక్ష చేశాం. వారం వారం పని ప్రగతి చూశా. అందుకే రెండు యూనిట్లు ప్రజలకు అంకితం చేయగలిగాం. యాదాద్రి పవర్ ప్లాంట్ జనవరి వరకు పూర్తిగా ప్రజలకు అంకితం చేస్తాం. భూసేకరణ నిధులకి ఇబ్బంది లేదు. రోడ్డు కోసం భూసేకరణ చేస్తే.. 24 గంటల్లో నిధులు ఇస్తాం. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదు అని ప్రచారం చేశారు. ప్రచారం చేసిన వాళ్లకు, ఉన్నది లేనట్టు చెప్పడం అలవాటు. కరెంట్ అంటే కాంగ్రెస్. నాగార్జున సాగర్ కట్టి.. జపాన్ నుంచి కంపనీలు పిలిచి కరెంట్ ఉత్పత్తి చేశాం. ఇప్పటికి కూడా అదే లేటెస్ట్ టెక్నాలజీ. కాంగ్రెస్ అధికారం లోకి రాగానే.. ఎనర్జీ పాలసీ తెచ్చింది. ఏ రాష్ట్రంలో కూడా 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లు లేవు. 51 లక్షల మంది ఇండ్లకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నాం. 17 వేల కోట్లు విద్యుత్ శాఖకు ఈ ప్రభుత్వం కడుతుంది' అని తెలిపారు.



'ఓ వ్యక్తి నాకు ఒకటి పంపారు. ఉద్యోగాలు పొందే వారికి కోట్లు ఖర్చు చేసి నియామకాలు చేయడం అవసరమా అని అడిగాడు. అందరిని పిలిచి.. మీకు ఉద్యోగ పత్రాలు ఇవ్వడం అంటే మానవ సంబంధాలు పెంచుకోవడం లాంటిది. మిషన్ లాగా.. మెకానికల్ లైఫ్ కాదు. మా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య మానవ సంబంధాలే ఉండాలని చూస్తున్నాం. బీఆర్ఎస్ పదేళ్లు ఉద్యోగాలు ఇవ్వలేదు, మేము ఇస్తుంటే తప్పుడు ప్రచారం చేస్తోంది. బీఆర్ఎస్ వాళ్లను చూసి నవ్వాలో లేదా ఏడవాలో అర్థం కావడం లేదు' అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు.

# ఇది కదా నాయకత్వం అంటే.. ఇది కదా ముందు చూపు అంటే..!

మొదటిపేజీ తరువాయి

నిర్వహించేవారు. కేంద్రానికి సీజన్‌కు ముందే లెక్కలతో సహా వినతులు ఇచ్చేవారు. ఏపీలోని నౌకాశ్రయాలకు మన ఆఫీసర్లను పంపి ఆదేశాలు ఇప్పించేవారు. దక్షిణమధ్య రైల్వే అధికారులకు స్వయంగా కేసీఆర్ ఫోన్లు చేసేవారు. 25 స్పెషల్ గూడ్స్ రైళ్ల ఏర్పాటుకు ప్రత్యేకంగా విజ్ఞప్తులు చేసేవారు. పక్కరాష్ట్రం రవాణా శాఖ మంత్రితో నేరుగా సంప్రదింపులు, ఏకంగా 4 వేల లారీలను రంగంలోకి దించేలా సన్నాహాలు చేసేవారు. పోర్టుల నుంచి నేరుగా మండలాలకు తరలించే వ్యూహాలు, ప్రతి రైతుకు సమయానికి యూరియా అందేలా చర్యలు తీసుకున్నారు. నేరుగా గ్రామాల్లోనే సరఫరా చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు, తెలంగాణలో ఏ ప్రాంతంలోనూ కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకునేవారు అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇది కదా వ్యవస్థను నడిపించే విధానం.. ఇది కదా రైతును రాజును చేసే సంకల్పం అని కేటీఆర్ స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు తప్ప.. పరిపాలన తెలియని అసమర్థులు.. రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు.. కన్నీళ్లు మిగిలాయన్నారు. ఓవైపు బూతులు తప్ప



చేతలు రాని ఢిల్లీ పార్టీల నాయకులకు.. మరోవైపు "వందేళ్ల విజన్‌కు నిలువెత్తు రూపమైన కేసీఆర్‌కు.." ఉన్న స్పష్టమైన తేడా ఇది అని నాలుగుకోట్ల తెలంగాణ సమాజానికి అర్థమైపోయింది..!! రైతును అరిగోస పెడుతున్న వాళ్ల పతనం ప్రారంభమైంది..!! అని కేటీఆర్ పేర్కొన్నారు. జై కిసాన్.. జై కేసీఆర్ అని కేటీఆర్ నినదించారు.

# చట్టానికి ఎవరూ చుట్టాలు కాదు

మొదటిపేజీ తరువాయి



ఉంటే ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నాడని, అలాంటిది జైలు శిక్ష అనుభవించిన నేతలు తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోదీ ప్రశ్నించారు. కొద్ది రోజుల క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచే ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం చేశారని గుర్తు చేశారు. అవినీతికి పాల్పడే నేతలే పరిపాలన చేస్తే దేశం ఎలా ముందుకు వెళ్తుందని అడిగారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్ట్ అయిన నేతలు 30 రోజుల పాటు జైలులో ఉంటే పదవి నుంచి తొలగించేందుకు వీలుగా ఉన్న బిల్లును ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. సీఎం అయినా, పీఎం అయినా 30 రోజులు జైలులో ఉంటే, 31వ రోజున వారి పదవి పోతుంది. వారంతట వారు రాజీనామా చేయకపోయినా ఈ బిల్లుతో పదవిని కోల్పోతారు. అయితే, ఇది చట్టం అయితే రాష్ట్రప్రభుత్వాలపై కేంద్రం కుట్రలకు పాల్పడే అవకాశం ఉందంటూ ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.



# జోగులాంబ అమ్మ వారి ఉద్యోగికి ఘన సన్మానం.

**శాలువా కప్పి దంపతులను ఆశీర్వదించిన మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్.**

**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 22 (ప్రజాస్వరం):** పవిత్ర పుణ్యక్షేత్రం జోగులాంబ అమ్మవారి దేవాలయ ఉద్యోగి మహేష్ దంపతులను వనపర్తి మార్కెట్ చైర్మన్ బండారు శ్రీనివాస గౌడ్ ఘన సన్మానం చేశారు. అమ్మవారి ఆలయంలో రికార్డు అసిస్టెంట్గా నిధులు నిర్వహించే మహేష్ ఇటీవల అలంపూర్ పట్టణ కేంద్రంలో నూతన గృహప్రవేశం చేశారు.ఈ మేరకు శ్రావణ చివరి శుక్రవారం పురస్కరించుకొని అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత మహేష్ నూతన గృహానికి వెళ్లి మహేష్ దంపతులకు శాలువా కప్పి దేవుడి విగ్రహాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రామ్ రెడ్డి,శ్రీనివాస యాదవ్,మధుసూదన్ గౌడ్ లు పాల్గొన్నారు.



# యూరియా కోసం రైతుల ఎదురుచూపు

**ఆత్మకూరు మండల కేంద్రంలో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతుల గోస**

**మక్తల్,ఆగష్టు 22,(ప్రజాస్వరం):** వనపర్తి జిల్లా మక్తల్ నియెజికవర్గం ఆత్మకూరు మండల కేంద్రం పి.ఏ.సి.యెస్ కార్యాలయంలో యూరియా లేక చెప్పులు లైన్లో పెట్టి అక్కడనే భోజనం చేస్తున్న వృద్ధ రైతులు... రైతులను పట్టించుకునే నాధుడే లేదు ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలకు షోపుటప్ గా టెంట్లు వస్తాయి మంచి నీళ్ళు వస్తాయి కానీ రైతులకు యూరియా ఇవ్వకపోవడమే కాక వారికి కనీస సౌకర్యాలు కూడా ఏర్పడు చేయడం లో ప్రభుత్వం విఫలయింది అని చెప్పటానికి ఇదే నిదర్శనం దేశానికి అన్నం పెట్టే రైతన్న నే విస్మరించిన ప్రజా పాలన ఆనాటి రోజులుం తెస్తా తెస్తా అని చెప్పు మాట మీద నిలబడి ఆనాటి రోజులు తెచ్చి రైతులను రోడ్ల మీద కోర్చోబెట్టిన రేవంత్ ప్రభుత్వం ఇంత దారుణమా నెంబర్ వన్ తెలంగాణ అని కోట్లు కోట్లు పెట్టి ప్రచారం చేస్తున్నారు తప్ప నెంబర్ వన్ అనే మాట కేవలం ప్రచారం కె పరిమితమైంది ఆచరణకు నోచుకోవట్లేదు



# మంచి ఫ్యామిలీ ఎంటైర్టైనర్ 'సుందరకాండ'

**హీరో నారా రోహిత్**

**విశాఖపట్నం,ఆగష్టు 22(ప్రజాస్వరం):** సుందరకాండ సినిమా మంచి ఫ్యామిలీ ఎంటైర్టైనర్. కుటుంబ సమేతంగా చూసి ఎంజాయ్ చేయాల్సిన సినిమా ఇది. పేరుకు తగ్గట్టే అందరి హృదయాలనూ ఆనందంలో ముంచెత్తే సినిమా 'సుందరకాండ'' అని నారా రోహిత్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'సుందరకాండ'. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మాతలు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం నోవాటేల్ హోటల్లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నారా రోహిత్ మాట్లాడాతు మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా చిత్రం నిలుస్తోందన్నారు.. ఎంతో ఎంజాయ్ చేస్తూ చేసిన సినిమా ఇదని వివరించారు.. అనంతరం కథానాయిక శ్రీదేవి విజయ్‌కుమార్ మాట్లాడుతూ 'ఒక రూల్ బ్రేక్ చేసి రొమాంటిక్ కామెడీ తీసినప్పుడు అది కచ్చితంగా సక్సెస్ అవుతుంది. ఇది అలాంటి సినిమానే అన్నారు..అనంతరం మరో హీరోయిన్ వీర్తి వాఘాని మాట్లాడుతూ కచ్చితంగా మంచి కంటెంట్ తో వచ్చిన సినిమాలన్నీ హిట్ అవుతాయి అలానే సుందరకాండ మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుందన్నారు.. అనంతరం నిర్మాత సంతోష్ మాట్లాడతు సినిమా చాలా అద్భుతంగా వచ్చింది అని అందరూ సినిమాను చుసి మమ్మల్ని ఆశీర్వాదం అందించాలన్నారు.



# శంకర్ పల్లి మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి

- 25 సంవత్సరాలు గడుస్తున్నా రీటెండర్ నిర్వహించిని అధికారులు
- నాయకుల ఒత్తిళ్లకు వ్యాపారస్తులకు వత్తాసు పలుకుతున్న అధికారులు
- మున్సిపల్ దుకాణ సముదాయాన్ని రిటెండర్లు నిర్వహించాలని కోరుతున్న స్థానికులు





**శంకర్ పల్లి ఆగస్టు 22(ప్రజాస్వరం):** సంవత్సరాల నుండి మున్సిపల్ అయానికి గండి పడుతున్న అధికారులకు గాని నాయకులకు గాని ఎలాంటి చలనం లేకపోవడం పట్ల స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి నాయకులు మారుతున్నారు అధికారులు మారుతున్నారు తప్ప మున్సిపల్ ఆదాయం పట్ల ఎవరు కూడా శ్రద్ధ చూపించడం లేదు.. గత 25 సంవత్సరాల క్రితం వ్యాపారస్తులకు దుకాణ సముదాయాన్ని కేటాయించి దుకాణాల కిరాయి కేవలం 500 నుండి 800 వసూలు చేస్తున్నారు... 25 సంవత్సరాలు నుండి రిటైడర్ నిర్వహించకపోవడంతో పాటు దుకాణాల కిరాయి పెంచకపోవడంతో స్థానిక ప్రజలు మండి పడుతున్నారు.శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహించిన ఆర్టీసీ యొక్క దుకాణ సముదాయంలో ఒక దుకాణానికి 20వేల నుండి 30000 వరకు ఆర్టీసీ యాజమాన్యం అద్దె వసూలు చేస్తుంది.. కానీ శంకర్ పల్లి గ్రామపంచాయతీ ఉన్నప్పటి అధికారులు గాని ప్రస్తుతం మున్సిపల్ అధికారులు గాని అద్దె విషయంలో ఎలాంటి చలనం లేదు..గతంలో ఉన్న కలెక్టర్లు మున్సిపల్ దుకాణ సముదాయాల అద్దె విషయంలో రి టెండర్ నిర్వహించలని ఆదేశాలిచ్చిన రాజకీయనాయకుల ఒత్తిళ్లకు అధికారులు ఏం చేయాలో తోచక వ్యాపారస్తులకి లాభం చేకూరుస్తున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న దుకాణ సముదాయాన్ని అన్ని వర్గాల వారికి కేటాయించాల్సి ఉండగా నిబంధనలను ఉల్లంఘించి ఒకే వర్గానికి దుకాణ సముదాయాలు కేటాయించి వారికే వత్తాసు పలుకుతున్నారు. 2018 సంవత్సరంలో గ్రామ పంచాయతీగా ఉన్న శంకర్ పల్లిని ఐదు గ్రామాలను కలుపుకొని మున్సిపాలిటీగా మార్చారు ఏడు సంవత్సరాలు గడుస్తున్న మున్సిపల్ దుకాణ సముదాయాలను రీ టెండర్ నిర్వహించకపోవడంతో మున్సిపల్ లో గల అన్ని గ్రామాల ప్రజలు నిరుద్యోగులు వ్యాపారస్తులు మోసపోతున్నారు. గతంలో ఉన్న అధికారులు తప్పనిసరిగా రీ టెండర్ నిర్వహించి అద్దె పెంచాలని సూచించిన రాజకీయ నాయకులు ఓట్ల కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చి ఫ్రీ టెండర్లు నిర్వహించకుండా ప్రలోభాలకు గురి చేస్తున్నారు. శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం దుకాణాల సముదాయం 238 ఉండగా వాటి అద్దె 200 నుంచి 800 వరకు వసూలు చేస్తున్నారు పక్కనే గల ఆర్టీసీ సముదాయంలో అద్దె 30 వేలు ఉంటే మున్సిపాలిటీ దుకాణ సమయంలో ఇంత తక్కువ అద్దె వసూలు చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఏ బి సి డి గా విభజించి అన్ని వర్గాల వారికి దుకాణాలు కేటాయించాల్సి ఉంటుంది కానీ అధికారులు గాని నాయకులు గాని వీడిపై ఎవరు నోరు మెదపడం లేదు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడుతున్న దానిని గుర్తించి మున్సిపల్ దుకాణ సముదాలకు రీటెండర్ నిర్వహించి అన్ని వర్గాల వారికి దుకాణాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



**రిటెండర్లు నిర్వహించాలి**

**గత 25 సంవత్సరాలుగా దుకాణ సముదాయాలకు రిటైడర్ నిర్వహించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. సంవత్సరం తరబడి మున్సిపల్ ఆదాయానికి గడ్డి పెడుతున్న అధికారులు కాలయాపన చేస్తున్నారు ఉన్నతాధికారులు స్పందించి అన్ని వర్గాలకు దుకాణ సముదాయం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలి.**

**ఈశ్వర్ స్థానికుడు**

# కేంద్ర ప్రభుత్వ నిధులతో అమృత్ 2.0.స్కీమ్ పనులు ప్రారంభం



**మక్తల్,ఆగష్టు22,( ప్రజాస్వరం):** ఆత్మకూరు భారతీయ జనతా పార్టీ మున్సిపల్ టీం ఇట్టి పనిని సందర్శించి అక్కడ ఉన్న మున్సిపల్ ఇంజినీర్,మెగా కంపెనీ అధికారూలతో మాట్లాడి పట్టణంలో కొన్ని కాలనీ లలో తీవ్ర మైన నీటి ఎదడి నివారణ కు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరడం జరిగింది.దీని అంచనా విలువ మొత్తం స్కీమ్ 17.90 ఉండగా ఇంకో ట్యాంక్ నిర్మాణం ఒకటవ వార్డ్ ఖానాపూర్ లో ఇంకా పనులు ప్రారంభం కాలేదు.వాటిని కూడా ప్రారంభించాలని కోరటం జరిగింది

అలాగే,గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు కూలిన మట్టి ఇండ్లకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం ఇవ్వక పోగా,కనీసం ఇప్పుడు ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లను వారికి ఇవ్వకపోవడం హాస్యస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణ సహాయం 30000/ రూపాయలు కూడా వారికి అందించలేదు.కావున గత ఏడాది వర్షాల కారణంగా కూలిన వారికి ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే కేటాయించి వారికి గూడు కల్పించాలని భారతీయ జనతాపార్టీ మున్సిపల్ శాఖ డిమాండ్ చేసింది



# అంగన్వాడి భవన నిర్మాణానికి భూమి పూజ

**మక్తల్,ఆగష్టు22,(ప్రజాస్వరం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతరలో భాగంగా నర్వ మండల కేంద్రానికి 12 లక్షల నిధులతో మంజూరైనటువంటి అంగన్వాడి భవన నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాన్ని పై అధికారులతో పాటు అగ్రికల్చర్ ఏఈ గ్రామ సెక్రెటరీ బుచ్చా రెడ్డి, ఏపీవో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.సం చెన్నయ్య సాగర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలీస్ జగన్మోహన్ రెడ్డి మాదిరెడ్డి రవీందర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి నర్వ మండల వైస్ ప్రెసిడెంట్ శరణప్ప జగదీశ్వర్ రెడ్డి , నర్వ టౌన్ అధ్యక్షులు సద్దలి ఆంజనేయ రెడ్డి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అశోక్ గౌడ్ , మాజీ ఎంపీటీసీ అయ్యన్న మాజీ ఉప సర్పంచ్ వై నరసింహారెడ్డి , మాసన్న గౌడ్ పి వెంకట్రామిరెడ్డి మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి ఫజల్ కే బాలస్వామి డీలర్ దండు నరసింహులు డబ్బులు ఆంజనేయులు ఎం నరసింహులు డీలర్ అనిల్ కుమార్ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు చాకలి బాబు, మండల మహిళా సమాఖ్య నాయకులు రాళ్లు గొల్ల మొగిలప్ప డ్రైవర్ కొండన్న సంఘం అయ్యప్ప మాజీ వార్డు మెంబర్ అంజన్న రజక సంఘం మండల అధ్యక్షులు చాకలి రవి చాకలి ఎర్ర బుచ్చన్న , చాకలి వెంకట్ రాములు కావలి కొండన్న లోకుపల్లి ఐలప్ప సద్దలి సత్య రెడ్డి మెట్ల నరేందర్ రఘురాం సందీప్ వివిధ గ్రామాలకు కార్యకర్తలు ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు





# ప్రభుత్వం మద్యం పాలసీని సవరించాలి

**బోలగాని జయరాములు కలిగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు**

**వలిగొండ,ఆగష్టు 22(ప్రజాస్వరం):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2025 సంవత్సరము ఎక్సైజ్ పాలసీని ప్రకటించడం జరిగింది అని అట్టి పాలసీలో మార్పు చేయవలసిన అవసరం ఉన్నాదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు అన్నారు. తేదీ 22.08.2025 శుక్రవారం రోజున రామన్నపేట పట్టణ కేంద్రంలో జరిగిన కల్లు గీత కార్మిక సంఘం మండల కమిటీ సమావేశాము సంఘం మండల అధ్యక్షులు ఎర్ర రవీందర్ అధ్యక్షతన జరిగింది. యిట్టి సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జయరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందుకు తమ ఎన్నికల మేనిఫెస్టోలో గౌడ గీత కార్మికులకు వైన్స్ షాపులలో 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మాట ఇచ్చారని ఇప్పుడు ప్రకటించిన ఎక్సైజ్ పాలసీలో 15% మాత్రమే ఉన్నదని ఇది ప్రభుత్వం మాట తప్పడమేనని ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఎక్సైజ్ పాలసీ ని సవరించి గౌడగీత కార్మికులకు వైన్స్ షాపులలో 25 శాతం కేటాయించి ధరావత్ 3 లక్షల రూపాయలు కట్టడం లేకుండా షాపులను మండల యూనిట్ గా కల్లు గీత సొసైటీలకు లాటరీ పద్ధతిలో కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని దానివల్ల పేద గీత కార్మికులకు వారి కుటుంబాలకు ఉపయోగం జరుగుతుందని అన్నారు. కానీ గౌడులకు కేటాయించిన వైన్స్లలో ధరావత్ 3 లక్షలు రూపాయలు పెట్టడం వల్ల గౌడ ధనిక కుటుంబాలకు మాత్రమే లాభం జరుగుతుందని పేద గౌడ గీత కార్మికులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రభుత్వం అనుకున్నా లక్ష్యం కూడా నెరవేరదని అన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు. జిల్లా ఉపాధ్యక్షులు భావనలపల్లి బాలరాజు జిల్లా నాయకులు కూనూరు మల్లేశం. మండల కోశాధికారి మునుకుంట్ల లేనిన్. గంగాదేవి అంజయ్య. సూర్వి ఎల్లయ్య. పాలకూర్ల యాదయ్య. పల్సర్ కనకయ్య ఆకిడి శ్రీనివాస్. పాలకర్ల అంజయ్య పాల కుర్ల శీను తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు రాకుండా హెల్త్ క్యాంపులు నిర్వహించాలి



**వలిగొండ,ఆగష్టు 22(ప్రజాస్వరం):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఇటీవల కురుస్తున్న అకాల వర్షాల ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. వర్కట్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో వరకట్పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపును సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే రకంగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ముఖ్యంగా మూసి పరివాహక ప్రాంత గ్రామాలుగా ఉన్న అన్ని గ్రామాల్లో ముందస్తుగా హెల్త్ క్యాంపులు నిర్వహించి సీజన్ వ్యాధులైన డెంగ్యూ మలేరియా పాటు ఇతర వ్యాధుల బారిన పడకుండా ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్య చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని గ్రామాల్లో దోమల నివారణకు బ్లీచింగ్ తో పాటు ఇతర మందులను స్ప్రే చేయాలని అన్ని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుండి నిధులు కేటాయించి ప్రజల ప్రాణాలు కాపాడుకునేందుకు ముందస్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక పిఎస్పీ ఏ ఎస్ ఎం వర కుమారి ఆశా వర్కర్ గుర్రం మీనా కుమారి తో పాటు గ్రామస్తులు చేకూరి నరసింహ మీసాల ఈశ్వరయ్య,మీసాల సుధాకర్,పెంటయ్య,మీసాల పరమేష్,బంగారు ప్రసాద్,లింగస్వామి,మీసాల ఎట్టెమ్మ,బంగారు పరమేష్,లక్ష్మమ్మ. ఎల్లమ్మ,అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేస్తాం

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్,ఆగస్టు 22(ప్రజా స్వరం) :**

బురాన్ పల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం వికారాబాద్ మండలంలోని బురాన్ పల్లి లో పల్లెల్లో పనుల జాతర 2025లో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.20 లక్షల వ్యయంతో చేపట్టే బురాన్ పల్లి గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన, పిడబ్ల్యుడి రోడ్డు నుండి బురాన్ పల్లి వరకు 63 లక్షలతో చేపట్టిన నూతన బిటి రోడ్డుకు, బురాన్ పల్లి నుండి ధన్నారం వరకు 63 లక్షలతో నూతనంగా చేపట్టిన బిటి రోడ్డులకు సభాపతి ప్రారంభోత్సవం గావించారు. ఈ సందర్భంగా సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు వెళుతుందన్నారు. ఇంకా ప్రజలకు ఇచ్చిన హామీలు అయిన మహాలక్ష్మి పథకం కింద ఇంటి యజమానికి 2500 ఆర్థిక సహాయం, కళ్యాణ లక్ష్మికి ఇవ్వాల్సిన తులం బంగారం త్వరలోనే చెల్లించనున్నట్లు ఆయన అన్నారు. గత ప్రభుత్వం 6 వేల కోట్ల అప్పు చేసిందని, వీటికి 6500 కోట్ల వడ్డీ చెల్లిస్తూనే ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వము ఇంటికి ఒక ఉద్యోగం, పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, ఉండడానికి ఇల్లు ఇవ్వలేక పోయిందని, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇండ్లు, రేషన్ కార్డులతో పాటు చౌకధర దుకాణాల ద్వారా ద్వారా సన్న బియ్యాన్ని సరఫరా చేయడంతో పాటుగా పెన్షన్లను కూడా అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం రద్దు చేసిన అసైన్మెంట్ కమిటీని పునరుద్ధరించి భూములు లేని పేదలకు భూములు ఇచ్చే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ తెలిపారు. పంట పొలాలకు వెళ్లే దారులకు రోడ్లు వేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారికి స్పీకర్ సూచించారు. గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని తహసిల్దార్ కు స్పీకర్ సూచించారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా సంఘాలను ప్రోత్సహించడం జరుగుతుందని అదేవిధంగా డ్వాక్రా సంఘాలకు మిత్తి లేని రుణాలను ఒక్కో సంఘానికి 10 లక్షల రూపాయల చొప్పున అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరున ఉండాలని ఉద్దేశంతో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ కింద ఉద్యానవన మొక్కలు నాటేందుకు ప్రొసీడింగ్ కాపీలను స్పీకర్ చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో డి ఆర్ డి ఓ శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, ఎంపిడిఓ వినయ్ కుమార్, పంచాయత్ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్టిఎ సభ్యులు జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



## నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

**శామీర్‌పేట, ఆగస్టు 22(ప్రజాస్వరం) :**

తూంకుంట పురపాలక సంఘ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవ నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్ల పై కమిషనర్ జ్యోతి సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు కమిషనర్ సూచించారు. వినాయక చవితి ఉత్సవల సందర్భంగా శామీర్ పేట్ పెద్ద చెరువును తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి సందర్శించారు. పెద్ద చెరువులో నిమజ్జనం సందర్భంగా క్రేన్లు, బారికేడ్లు, లైటింగ్, అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ సీఐ శ్రీనాథ్, మేడ్చల్ ట్రాఫిక్ సీఐ మధుసూదన్, ఆర్టీఏ మెంబర్ జైపాల్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ రాజీవ్ కుమార్ సింగ్, కరెంట్ ఏఈ రాఘవేంద్ర, శామీర్ పేట్ మెడికల్ ఆఫీసర్ విజయ నిర్మల, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలి

### సీఐటయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



**శామీర్ పేట ఆగస్టు 22(ప్రజాస్వరం) :**

అలియాబాద్ మున్సిపల్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం అలియాబాద్ గ్రంథాలయం వద్ద శుక్రవారం యూనియన్ నాయకుడు ఆరోగ్యం, ముత్యాలు అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఈ.శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఈఎస్ ఐపిఎఫ్ వెంటనే ఇవ్వాలని, గ్రామపంచాయతీ మున్సిపల్ జీతాలు నాలుగుల బకాయి జీతాలు వెంటనే ఇవ్వాలని ఎన్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ నాయకులు కృష్ణ,, లలిత, లత, మంజుల , లింగయ్య మరియు మున్సిపల్ కార్మికులు, పాల్గొన్నారు.

## ఎస్పీ నారాయణ రెడ్డికి భారత నౌకాదళం ప్రశంస

**వికారాబాద్, ఆగస్టు 22(ప్రజా స్వరం):**



జిల్లా ఎస్పీ శ్రీ కె. నారాయణ రెడ్డి చేసిన విశేష సేవలకు గాను భారత నౌకాదళం నుండి ప్రశంసా పత్రం లభించింది. భారత నౌకాదళ ఉప అధిపతి, వైస్ అడ్మిరల్ తరుణ్ సోబ్తి ఈ ప్రశంసా పత్రాన్ని శుక్రవారం ఎస్పీకి అందజేశారు. వికారాబాద్ జిల్లా ఎస్ పీ కె. నారాయణ రెడ్డి విధి నిర్వహణలో చూపించిన అంకితభావం, నిబద్ధత, వృత్తి నైపుణ్యానికి ఈ ప్రశంస లభించింది. ఈ గౌరవం పొందడం పట్ల కె. నారాయణ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కూడా పాల్గొనడం జరిగింది.

## గ్రామాల్లో 'పనుల జాతర'



### ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**తాండూరు ,ఆగస్టు 22 (ప్రజాస్వరం) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పనుల జాతర 2025"ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, ముఖ్యంగా మౌలిక వసతులు చేపడుతున్నట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం బండపల్లి, ఇందూరు గ్రామాలలో రూ.16 లక్షలతో నూతనంగా నిర్మించే అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన మరియు సిద్ధన్న మడుగు తండాలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించే గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేశారు అనంతరం ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు, కంపోస్ట్ షెడ్లు, కోళ్ళ ఫామ్, మేకల షెడ్లు మంజూరైన వారికి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే బీఎంఆర్ లబ్ధిదారులకు అందించారు. పంచాయతీ కార్మికులకు, ఫీల్డ్ అసిస్టెంట్ లకు, ఉపాధి హామీ కూలీలకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోనల్ లెవెల్ క్రీడలను ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**పరిగి, ఆగస్టు 22 (ప్రజాస్వరం) :**

కుల్కచర్ల మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 69వ ఎస్ జి ఎఫ్ పరిగి జోనల్ లెవెల్ యు/14 మరియు యు/17 బాల,బాలికల వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్ర,జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు సంపాదించాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తి, ఆరోగ్యం అభివృద్ధి చెందుతాయని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రగతి సాధించాలని, ఇందుకు కావాల్సిన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



## చెత్త లారీల రాకపోకలను నిషేధించండి

**జవహర్ నగర్, ఆగస్టు 22, (ప్రజాస్వరం) :**

ప్రజల ప్రాణాలు, ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న జిహెచ్ఎంసి చెత్త డంపింగ్ యార్డ్ వాహనాలు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల మీదుగా డంపింగ్ యార్డ్ కు వెళ్లే వాహనాల రాకపోకలను నిషేధించాలని బిజెపి ఓబీసీ సెల్ నాయకుడు రంగుల శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వసంత ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ... రాత్రి పగలు తేడా లేకుండా హైదరాబాద్ నగరం నుండి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు చెత్త తరలించే జిహెచ్ఎంసి చెత్త వాహనాలు కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ అంబేద్కర్ నగర్ ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రతి నిత్యం ప్రమాదాలు జరగడంతో పాటు, తీవ్రమైన కాలుష్యం ఏర్పడుతుందన్నారు. జవహర్ నగర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడే చెత్త లారీలు వారికి కేటాయించిన ప్రత్యేక రహదారి నుండి మాత్రమే డంపింగ్ యార్డ్ కు చేరుకోవాలని బాలాజీ నగర్, అంబేద్కర్ నగర్ మీదుగా రాకపోకలు సాగించకూడదని చేసిన తీర్మానాన్ని అధికారులు ఆమోదించి కొంతకాలం రాకపోకలు నిలిపివేశారని ప్రస్తుతం జిఎస్ఎంసి చెత్త వాహనాల రాకపోకలను తిరిగి యధాతధంగా ప్రయాణిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కమిషనర్ కు తెలియజేయడంతో వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్ ట్రాఫిక్ పోలీస్ అధికారులతో చర్చించి సమస్యకు పరిష్కారం తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మంచన శ్రావణ్ కుమార్, జిలల తులసిరాం, మరియు అమిత్, ప్రశాంత్,హరీష్, ఉదయ్, మనోజ్, రాజశేఖర్, ప్రదీప్, చింటూ, యుగేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## రూ.1000 కోట్లతో రహదారి నిర్మాణం

**వికారాబాద్, (ప్రజా స్వరం) :**

వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం పరిధిలోని మన్నెగూడ నుంచి కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని రావులపల్లి వరకు రూ.1000 కోట్లతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అప్ప జంక్షన్-మన్నెగూడ నేషనల్ హైవే పనులను పరిశీలించారు. హైదరాబాద్ బీజాపూర్ మార్గంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అప్ప జంక్షన్ నుంచి వికారాబాద్ జిల్లా మన్నెగూడ వరకు నిర్మాణం అవుతున్న నేషనల్ హైవే పనులను , అలాగే చేవెళ్ల వద్ద జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను పరిగి ఎమ్మెల్యే, డి.సి.సి అధ్యక్షులు టి.రామ్మోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రూ.1050కోట్లతో అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నిర్మించబోయే నేషనల్ హైవే పనులకు అన్ని అడ్డంకులు తొలగాయని చెప్పారు. ఇటీవలే మొయినాబాద్ వద్ద జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను కూడా పరిశీలించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ఇరువైపులా ఉన్న మర్రి చెట్ల విషయంలో గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసిన పర్యావరణ వేత్తలు, కేసును ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అదేవిధంగా మన్నెగూడ నుంచి కొడంగల్ నియోజకవర్గంలోని కర్ణాటక సరిహద్దు వద్ద కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని రావులపల్లి వరకు రూ.1000 కోట్లతో నాలుగు లైన్ల రహదారి మంజూరైందని తెలిపారు.

## మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ

**పరిగి, ఆగస్టు 22 (ప్రజా స్వరం) :**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహమ్మదాబాద్ మండలంలోని ఓల్డ్ ఎమ్మార్వో కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు రూ.6 కోట్లు 79 లక్షల 50 వేల విలువైన చెక్కులను పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు,అధికారులతో కలిసి పంపిణీ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మహమ్మదాబాద్ మండలంలోని గాదిర్యాల్ గ్రామంలో పరిగి ఎమ్మెల్యే , డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పశువుల షెడ్డును ప్రారంభించారు.అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలించారు. మహమ్మదాబాద్ మండలంలోని ముందలి తండాలో నూతనంగా నిర్మించిన పశువుల షెడ్డును మరియు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే స్థానిక నాయకులు,అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పనుల జాతరలో భాగంగా నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

## పట్టణాల్లో పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

### బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఆనంద్



**వికారాబాద్, (ప్రజా స్వరం) :**

చేతగాని కాంగ్రెస్ పాలనలో పట్టణాలు ,గ్రామాల్లో పారిశుధ్యం పడకేయడంతో ప్రజలు నిత్యం డెంగీ, టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మెతుకు ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో "పల్లె ప్రగతి" వల్ల మొన్నటి దాకా మురిసిన పల్లెలు ముందుచూపు లేని ముఖ్యమంత్రి వల్ల నేడు మురికి కూపాలుగా తయారవుతున్నాయన్నారు. 'పట్టణ ప్రగతి'తో మెరిసిన పట్టణాలు సమస్యలతో కొట్టుమిట్టడుతున్నాయన్నారు. కనీసం చెత్త ట్రాక్టర్లకు డీజిల్ కూడా సమకూర్చలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. అపరిశుభ్ర వాతావరణం సర్వరోగాలకు సింహద్వారం అన్నట్టు.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సకల వ్యాధులు చాపకింద నీరులా వ్యాపించి ప్రాణాంతకంగా మారుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు మంచం పడుతున్నాయని తెలిపారు. పట్టణ డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో రోజుల తరబడి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందన్నారు. చెత్తను తొలగించకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ కుప్పలు కుప్పలుగా పేరుకుపోయి పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారిపోయాయనీ వియర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో & పట్టణాల్లో పారిశుధ్యం సమస్యను పరిష్కరించాలని, అటుపల్లెలు ఇటు పట్టణాలను బాగు చేయాలని లేదంటే పాలకులు అధికారులు గ్రామాల్లో పట్టణాల్లో తిరిగే పరిస్థితి ఉండదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు.

## ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి


### జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

**మెదక్, ఆగస్టు 22 (ప్రజా స్వరం) :**

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో వన మహోత్సవం కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాస రావు మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు ఎంతగానో ఉపయోగపడుతుంటాయని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. చెట్లను మారడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణంలో ఆక్సిజన్ శాతం తగ్గుతుందని దీనితో మానవాళి మనుగడే ప్రశ్నర్థికంగా మారుతుందని అన్నారు. మొక్కలను పెంచడంతో సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్, ఏ అర్ డీఎస్పీ రంగ నాయక్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ లు, కానిస్టేబుల్ లు, తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ సెమినార్ ప్రారంభం




**మెదక్, ఆగస్టు 22 (ప్రజా స్వరం) :**

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సెమినార్ కార్యక్రమం మెదక్ పట్టణం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హైదరాబాద్ ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి, ముఖ్య వక్త ప్రొఫెసర్ పార్థసారథి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గవర్నెన్స్, ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్, వికసిత్ భారత్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇలాంటి సెమినార్ ల వల్ల విద్యార్థుల్లో మార్పు వస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న ఆధునికతకు అనుకూలంగా అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు శరత్ రెడ్డి, తిరుమల రెడ్డి, సురేందర్ రావు, వినోద్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఏళ్ల తరబడి రోడ్డు లేని పెద్దవేడు తండా వాసులకు త్వరలో రోడ్డు

- రోడ్డు సౌకర్యం కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళిన గ్రామస్థులు
- వెంటనే ఎమ్మెల్యే యాదయ్య, అధికారులతో మాట్లాడిన చైర్మన్
- 15 రోజుల్లో రోడ్డులు పనులు జరిగేలా చర్యలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 22(ప్రజాస్వరం):**ఏళ్ల తరబడి పెద్ద వేడు తండా వాసులకు రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కుంటున్న సమస్య జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణానికి నోచుకోనుంది. శుక్రవారం షాబాద్ మండలం పెద్దవేడు గ్రామానికి చెందిన పలువురు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డిని కలిసి రోడ్డు లేని దుస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు. వెంటనే చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తో మాట్లాడి ఎన్నో ఏళ్లుగా తండా రోడ్డు నిర్మాణానికి నోచుకోని సమస్యను వివరించారు. అలాగే అధికారులతో కూడా స్వయంగా మాట్లాడి రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. పదిహేను రోజుల్లో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆయనను కలిసిన గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కారం నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకంతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి దృష్టికి తేగా తొందరలో రోడ్డు నిర్మాణం జరిగేలా ఎమ్మెల్యే కాలే యాదయ్య, అధికారులతో మాట్లాడి చొరవ తీసుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ట్యాంక్ బండ్ పై షోయబుల్లాఖాన్ విగ్రహం పెట్టాలి..

- జర్నలిస్ట్ కేపీ డిమాండ్..
- షాద్ నగర్ లో ఏర్పాటుకు తాను సిద్ధమని ప్రకటన..
- షాద్ నగర్ లో టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ కు ఘన నివాళి
- టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్ నరేష్ నేతృత్వంలో ఘన నివాళి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 22(ప్రజాస్వరం):**నిజాంపై అక్షర పోరాటం చేసి తన రెండు చేతులను పోగొట్టుకున్న మహనీయుడు, ఆదర్శాల కోసం విలువైన ప్రాణాలను అర్పించి జర్నలిస్టులకు ఆదర్శప్రాయుడైన షోయబుల్లాఖాన్ విగ్రహాన్ని ట్యాంకుబండు మీద ఏర్పాటు చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు జర్నలిస్ట్ ఎండి ఖాజాపాషా (కేపీ) డిమాండ్ చేశారు. షాద్ నగర్ లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థలాన్ని కేటాయిస్తే తన సొంత ఖర్చుతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.నిజాం పోరాట యోధుడు, జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ 77వ వర్ధంతిని పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణ కూడలిపై షాద్ నగర్ టిడబ్ల్యూజేఎఫ్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్ నరేష్ ఆధ్వర్యంలోస్థానిక జర్నలిస్టులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు ఆయన మాట్లాడుతూ నిజాం ప్రభుత్వ నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ అక్షర పోరాటం చేసిన షోయబుల్లాఖాన్ జర్నలిస్టులకు ఆదర్శమని ప్రశంసించారు. అలాంటి మహనీయుడికి గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ చరిత్రలో గుర్తుంచుకోవలసిన జర్నలిస్టులు కొందరే ఉన్నారని అలాంటి వారిలో షోయబుల్లాఖాన్ ముందువరుసలో ఉంటారని ప్రశంసించారు. ఆయన ఆదర్శంగా ప్రతి జర్నలిస్టు నిజాయితీగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ప్రధాన కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ నిజాం నిరంకుశత్వం నుంచి ప్రజలను కాపాడేందుకు తన రెండు చేతులను పోగొట్టుకున్న షోయబుల్లాఖాన్ ను చరిత్ర ఇప్పటికీ మర్చిపోతున్నారనీ జర్నలిస్టులు లక్మాకుల రమేష్ కుమార్, కస్తూరి రంగనాథ్, నరసింహారెడ్డి, అప్సర్, సురేష్, రాకేష్, సాయినాథ్ రెడ్డి, కృష్ణ, జగన్, మహేష్, బాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## సూర్యాపేట జిల్లాలో దారుణం.. ముగ్గురిపై హత్యాయత్నం

**సూర్యాపేట ఆగస్టు 22(ప్రజాస్వరం):** సూర్యాపేట జిల్లాలో దారుణం వెలుగుచూసింది. పట్టపగలే ముగ్గురిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు దుండగులు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురిని చంపేందుకు ఐదుగురు వ్యక్తులు కారులో వెంబడించారు. సూర్యాపేటలో ఖమ్మం క్రాస్ రోడ్ నుంచి బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని (ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు) కారులో దుండగులు వెంబడించారు.

**వైన్స్ లోకి పరుగులు..**

దుండగుల నుంచి తప్పించుకునేందుకు బాధితులు ద్విచక్ర వాహనాన్ని వేగంగా పోనిచ్చారు. అయినప్పటికీ దుండగులు వదలకపోవడంతో బీబీగూడెం సమీపంలో ఉన్న ఓ వైన్స్ షాప్ ఎదుట బైక్‌ను పడేసి, షాప్‌లోకి పరుగులు పెట్టారు బాధితులు. దీంతో కారును ఆపిన దుండగులు కత్తులు, కర్రలతో కారు దిగి.. వైన్స్ లోకి వెళ్లడానికి ప్రయత్నంచారు. అయితే అప్పుడే వైన్స్ షాప్‌లో నుంచి జనాలు బయటకు రావడంతో వారిని చూసిన దుండగులు కారు ఎక్కి, అక్కడి నుంచి పారిపోయారు.ఈ ఘటనకు సంబంధించి అంతా అక్కడే ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.







## కుందన ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ కంపెనీని మూసివేయాలి

- చందనవెల్లి గ్రామస్తులు కంపెనీ ముందు బైఠాయింపు
- రాత్రిపూట మోటార్ల ద్వారా కలుషితమైన రసాయనాలు వదులుతున్నారు
- ఇంతవరకు పొల్యూషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే అధికారులే లేరు
- కంపెనీ యజమానికి పలుమార్లు ఫిర్యాదు చేసిన యజమాని ముఖం దాటేశారు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 22(ప్రజాస్వరం):**రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని చందన వెల్లి, గ్రామానికి దగ్గరలో ఉన్న కుందన్ టెక్స్టైల్ కంపెనీ, వల్ల వచ్చే ప్లాస్టిక్ తో కూడుకున్న వాయుజల కాలుష్యానికి వృద్ధులు, చిన్నపిల్లలు, మొదలుకొని ఆస్తమా రోగాల బారిన పడిన చందనవెల్లి గ్రామ ప్రజలు శుక్రవారం చందనవెల్లి గ్రామ ప్రజలు, కుందన టెక్స్టైల్ కంపెనీని మూసివేయాలని, కంపెనీ ముందు చందనవెల్లి గ్రామస్తులు శుక్రవారం ఉదయం 7 గంటల నుండి కుందన టెక్స్టైల్ కంపెనీ ముందు బైఠాయించారు. కుందన్ కంపెనీ నుండి రాత్రి సమయాన మోటార్లతో కాలుష్యాన్ని వదలడం వల్ల ఆ గ్రామ ప్రజలు తీవ్రమైన రోగానపడ్డారు, చిన్నపిల్లలు, వయోవృద్ధులు ఆస్తమా రోగానపడ్డారని చందనవెల్లి గ్రామ ప్రజలు తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల దానిలో కలిపే కల్తీతమైన రసాయనాల ద్వారా చందనవెల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువులో చేపలు పూర్తిగా చనిపోయాయని గ్రామస్తులు తెలిపారు, వ్యర్థ జలాల ద్వారా చెరువులోకి నీరు రావడంతో పశువులు ఆ నీరు త్రాగి రెండు ఎద్దులు ఆవులు చనిపోయాయని చందనవెల్లి గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు, ఇంతవరకు పొల్యూషన్ బోర్డ్ కు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని దీంతో ఈ కుందన టెక్స్టైల్ కంపెనీని మూసివేయాలని శుక్రవారం ఉదయం 7 గంటల నుండి కంపెనీ ముందు బైఠాయించారు, కంపెనీ వల్ల కలుషితమైన వ్యర్థాలు బయటికి విడిచి పెట్టినప్పుడు కల్తీ రసాయనాలతో కెమికల్ వాడటం వల్ల వ్యవసాయ రైతుల కాళ్లకు పూర్తిగా కురుపులతో రోగాల పాలై వ్యవసాయం చేయలేని పరిస్థితుల్లో ఉండటంవల్ల ఇంతవరకు కంపెనీ యజమానికి పలుమార్లు గ్రామస్తులు విన్నవించినప్పటికీ కుందన్ టెక్స్టైల్ కంపెనీ యజమాని పట్టించుకోకపోవడంతో చందనవెల్లి గ్రామస్తులు కంపెనీ మూసివేయాలని బైఠాయించారు, కుందన్ టెక్స్టైల్ కంపెనీ స్థాపించిన యజమానులు వచ్చేంత వరకు తమ పోరాటం సాగుతుందని చందన్వెల్లి గ్రామస్తులు కంపెనీ యజమానులపై మండిపడుత కంపెనీ సిబ్బంది ఒప్పుకున్న నిజ నిజాలు వాస్తవమే, చందన్ వెల్లి టెక్స్టైల్ కంపెనీ నుండి ప్లాస్టిక్ వాడకం వల్ల దాని నుండి వచ్చే కలుషితమైన రసాయనాల ద్వారా చందనవెల్లి గ్రామంలో గ్రామస్తులకు రోగాలు వచ్చిన మాట వాస్తవమేనని, రైతుల కాళ్లకు కురుపులు చిన్నపిల్లల నుండి పెద్దవారికి ఆస్తమా రోగాల పడిన విషయాలు నిజమేనని కుందన్ కంపెనీ యాజమానులు ఒప్పుకున్నారు, దీంతో నిజ నిజాలు తెలుసుకున్న చందనవెల్లి గ్రామస్తులు కుందన్ టెక్స్టైల్ కంపెనీ యజమాని వచ్చేంతవరకు తమ పోరాటం సాంగుతుందని తేల్చి చెప్పేశారు, దీంతో సిబ్బంది పక్కకు జరిగారు, ఉదయం 7 గంటల నుండి కంపెనీ ముందు చందనవెల్లి గ్రామస్తులు బైఠాయించిన విషయం తెలుసుకున్న షాబాద్ పోలీస్ సిబ్బందితో పాటు సిఐ కాంతారెడ్డి పోలీస్ సిబ్బందిని కంపెనీ ముందు మురయించారు.





## గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ఆగస్ట్ 22(ప్రజాస్వరం):**గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఘనంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనము సమావేశ మందిరంలో గణేష్ చతుర్థి ఉత్సవాల ఏర్పాట్ల పై డిసిపిలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనరులు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై సెప్టెంబర్ 6న నిమజ్జనం చేయన్నునందున, వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు, నిర్వాహకులు భక్తి శ్రద్దలతో సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. జిల్లాలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. గణేష్ శోభాయాత్ర నిర్వహించే దారిలో గుంతలు పడిన రహదారులు, ప్యాచ్ వర్క రిపేర్ పనులు, గణేష నిమజ్జనం నిర్వహించే ప్రదేశాల వద్ద క్రెన్లు, బారికేడింగ్, వేదిక ఏర్పాట్లు మున్సిపల్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు కలసి చేపట్టాలని, అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని సమన్వయముతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగించాలని, సమస్యలు ఎక్కువగా ఉన్నచోట భారీ బందోబస్తూ కల్పించాలని, సిసి కెమెరాలు ఏర్పాట్లు చేయాలని, భారీ కేడింగ్, బందోబస్త్, మెడికల్, సానిటేషన్, కంట్రోలింగ్ రూం తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. నంబరింగ్ ఇచ్చిన మండపాల దగ్గర పరిశుభ్రత పాటించాలని, మండపాల దగ్గర ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ఫాగింగ్, సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యుత్ కు సంబంధించి ఫోల్స్ అవసరమున్నచోట ఏర్పాటు చేయాలని, లోహ్యాంగింగ్ వైర్స్ ని సరి చేయాలని అన్నారు. విగ్రహాలు ఊరేగింపు సమయంలో వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జనం సమయంలో వేలాడే తీగలు, వంగి ఉన్న చెట్లు, తదితర వాటిని తొలిగించాలని తెలిపారు. చెరువుల వద్ద క్రేన్ లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో పని చేయాలి సూచించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసేలా, నిమజ్జనం సమయంలో చెరువుల వద్ద అవసరమైన క్రేన్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండ విద్యుత్ సరఫరా చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ ఏర్పాట్లు చేపట్టేలా అధికారులకు సూచనలు చేయాలని కలెక్టర్ ని కోరడం జరిగినది. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, మహేశ్వరం డిసిపి సునితా రెడ్డి, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్, శంషాబాద్ అడిషనల్ డిసిపి కె. రామ్ కుమార్, మాదాపూర్ అడిషనల్ డిసిపి సాయిరామ్, ఆర్డీఓలు అనంత రెడ్డి, చంద్రకళ, సరిత, జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనరులు, పోలీస్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## టీపీయూఎస్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన వ్రిహా విద్యార్థులు

**శేరిలింగంపల్లి ఆగస్టు 22(ప్రజాస్వరం):**తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం టీపియూస్ నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ - సీజన్ 6లో మొత్తం 20 జట్లతో పోటీ పడి, వ్రిహా స్కూల్ విద్యార్థులు ఛాంపియన్లుగా నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో 10వ తరగతి విద్యార్థి చరణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకోగా, 9వ తరగతి విద్యార్థి అభినవ్ తన అద్భుత ఆటతీరుతో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నారు. విజేతలను చైర్మన్ జి.టి. విజయకృష్ణ మరియు డైరెక్టర్ ప్రియ బంధవి సన్మానించి, విద్యతో పాటు క్రీడల్లో కూడా ముందుకు సాగాలని అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టిక ఆహారమే కరువా

**ఎంఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాని భాను ప్రసాద్**

**శంకర్ పల్లి ఆగస్టు 22(ప్రజాస్వరం):**రంగారెడ్డి జిల్లాలోని ప్రొద్దుటూరు గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సమయంలో ఎమ్మెస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాని భానుప్రసాద్, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తదనంతరం విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. సరైన మౌలిక వసతులు లేవని పరిసరాలు శుభ్రంగా ఉంచాలని పాఠశాల చుట్టూ గడ్డితో కూడి ఉందని అసలే వర్షాకాలంతో పాములు ఇతర కీటకాలు వచ్చే అవకాశం ఉందని వాటిని వెంటనే శుభ్రపరచాలని, ఉన్నత పాఠశాలలో బారుల బాత్రూంలో లేవని, ప్లే గ్రౌండ్లో వర్షం కారణంగా చిన్న చిరుజల్లు వచ్చిన నీళ్లు నిలుస్తున్నాయని, వాటి పై వెంటనే చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్న వారిని ఏ బదిలీ రసీదు లేకుండానే ఎంఈఓ తనకు అనుగుణంగా ఉపాధ్యాయులను బదిలీలు చేసుకుంటూ ఎతేచగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు, ప్రొద్దుటూరు గ్రామంలోని పాఠశాలలో బదిలీపై వచ్చిన ని ఎంఈఓ ఎటువంటి బదిలీ లేకుండా వేరే పాఠశాలకు పంపారు వారిని వెంటనే తన పాఠశాలకు పంపాలని లేని పక్షాన వారిపై వేటు తప్పదని, హెచ్చరించారు. పాఠశాలల్లో మౌలిక వసతులను పట్టించుకోకుండా పాఠశాలల్లో డెవలప్మెంట్ ఫండ్ వేరే ఇతర ఇతర వ్యవహారాలకు ఉపయోగిస్తున్నట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అలాగే మధ్యాహ్న భోజనంలో పౌష్టిక ఆహారం ఉండట్లేదని వారికి అక్షయపాత్ర రాకముందు వారంలో రెండు గుడ్లు ఒక అరటిపండు ఉండేవని వాటిని ఇప్పుడు ఇవ్వట్లేదని, విద్యార్థులకు మంచి పౌష్టిక ఆహారాన్ని అందించడంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.





## రిజిస్ట్రేషన్ కోసం రూ.లక్ష లంచం.. ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 22(ప్రజాస్వరం):** అవినీతి అధికారులు మారడం లేదు. లంచం తీసుకోనిదే పనులు చేయడం లేదు. ఓ వైపు ఏసీబీ అధికారులు నిత్యం దాడులు చేస్తూ.. కేసులు పెడుతున్నా లంచాలకు మరిగిన అధికారులు భయపడటం లేదు. లంచం తీసుకోవడం కూడా ఒక డ్యూటీగా భావిస్తున్నారు. తాజాగా లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి చిక్కాడు. రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.రాజేష్ కుమార్ పని చేస్తున్నాడు. ఇటీవల ఓ వ్యక్తి తన ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారిని సంప్రదించాడు. ఆస్తి నమోదు ప్రక్రియను ప్రాసెస్ చేయడానికి సబ్ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రూ.లక్ష లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. డాక్యుమెంట్ రైటర్ కార్యాలయంలో పని చేస్తున్న నాగోలుకు చెందిన టైపిస్ట్ కె రమేష్ ద్వారా శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ రూ.70 వేల లంచం తీసుకున్నాడు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌తో పాటు టైపిస్ట్ రమేష్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

**డాక్యుమెంట్ రైటర్లదే హవా..**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్ల (document writers) రాజ్యం నడుస్తోంది. సబ్ రిజిస్ట్రార్లు, కార్యాలయ సిబ్బంది వారి ద్వారానే లంచాలు తీసుకుంటున్నారు. నిత్యం కార్యాలయంలో ప్రజల కంటే డాక్యుమెంట్ రైటర్ల హడావుడి అధికంగా ఉంటుంది. కార్యాలయంలోకి వారిని అనుమతించవద్దని ఆదేశాలు ఉన్నా.. అధికారులు లెక్క చేయడం లేదు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారు నేరుగా వస్తే పనులు చేయడం లేదు. డాక్యుమెంట్ రైటర్ ద్వారా వచ్చి.. అధికారుల చేతులు తడిపితేనే పనులు సాగుతున్నాయి. అంతేగాకుండా పలు చోట్ల అధికారులు డబ్బులు తీసుకొని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. శుక్రవారం ఒక్క రోజే ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఏసీబీకి చిక్కడంతో ఆ శాఖలో చర్చనీయాంశం అయింది. ఆదిలాబాద్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరెడ్డి సైతం రూ.5 వేలు లంచం తీసుకుంటూ దొరికిన విషయం తెలిసిందే.

**లంచం ఇవ్వొద్దు**

ప్రజలు అధికారులకు లంచాలు ఇవ్వొద్దని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. ఎవరైనా లంచం అడిగితే భయపడకుండా ఏసీబీకి ఫోన్ చేయాలని చెబుతున్నారు. 1064 టోల్ ఫ్రీ నంబర్, వాట్సాప్ నంబర్ 9440446106కు సమాచారం అందిస్తే అవినీతి అధికారుల పని పడతామని భరోసా ఇస్తున్నారు. ఎంత మొత్తం లంచం అడిగినా.. వస్తు రూపంలో బహుమతులు అడిగినా తమకు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## మార్వాడీ గో బ్యాక్... తెలంగాణ బంద్

**హైదరాబాద్ ఆగస్టు 22(ప్రజాస్వరం):**

తెలంగాణ వ్యాప్తంగా మార్వాడీ గో బ్యాక్ ఉద్యమం ఉద్ధృతమవుతోంది. మార్వాడీ వ్యాపారాలతో స్థానికుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయన్న కారణంతో ఒయు జెఎసి తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చింది. మార్వాడీలు స్థానికుల ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్నారని, తిరిగి స్థానికులపై దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన చేస్తున్నారు. తెలంగాణ ప్రజలపై ఆధారపడి బతుకుతూ, వారిపైనే పెత్తనం చేస్తున్నారనే ఆరోపణలతో మార్వాడీ-గుజరాతీలకు వ్యతిరేకంగా ఆందోళనలు ఉద్ధృతమయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లా, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో షాపులు బంద్ చేశారు. ఒయు జెఎసి పిలుపుతో షాపులు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. మార్వాడీ గో బ్యాక్ అంటూ వ్యాపారులు నినాదాలు చేస్తున్నారు. ఎక్కడ నుంచో వచ్చి తమ ఉపాధి దెబ్బతీస్తున్నారని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మార్వాడీ గో బ్యాక్' వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ క్యాంపెయిన్‌ని నిర్వహిస్తున్న పృథ్వీరాజ్ యాదవ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా మార్వాడీలకు బిజెపి నేతలు బండి సంజయ్, రాంచందర్ రావు, రాజాసింగ్ మద్దతుగా నిలిచారు.



## ఎమ్మెల్యే హరీష్ రావు గొప్పలు చెప్పడం తప్ప చేసింది ఎం లేదు

**సిద్దిపేట ఆగస్టు 22 (ప్రజాస్వరం)**




హరీష్ రావు సిద్దిపేట కు నిధులు తెచ్చిన అని 2.60 కోట్ల రూపాయలు తెచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నడని.కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియెజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు సిద్దిపేట కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఇంఛార్జి మంత్రి కి నియెజకవర్గానికి అంగన్వాడీ భవనాలు మంత్రి కొండ సురేఖ మంజూరు చేశారు.. నిన్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు నేను నిధులు తెచ్చానని గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేయడం బాధాకరం అన్నారు..మీ మోసాలు ఏమిటో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ లో నష్టపోయిన రైతులు చెపుతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు నష్టపరిహారం చెల్లించామని తెలిపారు.. హరీష్ రావు నీకు నిధులు ఎవరు ఇచ్చారో చెప్పాలని సిద్దిపేట అంబెద్కర్ వద్ద చర్చకు సిద్ధమా అని అని సవాళ్ళను విసిరారు..యూరియా కోసం బీజేపీ మీదా ఒత్తిడి చేయాలని.కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం మీదా ఒత్తిడి చేస్తున్నాం మాతో కలిసి యూరియా కొసం పోరాటం చేయాలని డిమాండ్ చేశారు.తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్ లకు ఆదేశాలు వెంటనే తడిసిన ధాన్యం కొన్నామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ చేతల ప్రభుత్వం అని మిలాగా మోసం చేసే పార్టీ కాదని మీ పార్టీ మాటలు తప్ప చేతలు చాతకాదన్నారు బీఆర్ఎస్ లో ముసలం మొదలైందని నీవు నీ పార్టీ లో ఎవ్వరిని ఎదగన్నివ్వడం లేదని మీ పార్టీ నాయకులు ని చౌరస్తాలల్లో చర్చలు జరుపుతున్నారన్నారు.. అకాల వర్షం వల్ల నష్ట పోయిన రైతులకు పరిహారం ఇస్తా అని చెప్పి ఫొటో లు దిగి రైతులను మోసం చేసావున్నారు..సిద్దిపేటకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 22 కోట్ల నిధులు తెచ్చానని నిధులు లేకుండా ఆగిపోయిన పనులకు త్వరలో నిధులు తెచ్చి అన్ని పనులు పూర్తి చేస్తానని తెలిపారు.. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి,కలీముద్దీన్ అహ్మద్,మార్క సతీష్ దాస అంజయ్య, కౌన్సిలర్స్ సాకి ఆనంద్, రియాజుద్దీన్,డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి,కాంగ్రెస్ నాయకులు అర్షద్, రాజబాహదూర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

# కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకర్ రెడ్డి కన్నుమూత

- వామపక్ష దిగ్గజం సురవరం అస్తమయం
- హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అస్తమయం
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ సేవలు
- నల్గొండ నుంచి రెండుసార్లు లోక్‌సభకు ఎన్నిక
- కార్మికులు, రైతుల పక్షాన ఎన్నో ఉద్యమాలు
- ఆయన మృతిపై పలువురు నేతల సంతాపం

**హైదరాబాద్ ఆగస్టు 22(ప్రజాస్వరం):** వామపక్ష దిగ్గజం, సీపీఐ సీనియర్ నేత, ఆ పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి (83) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో కమ్యూనిస్టు ఉద్యమంలో ఓ శకం ముగిసినట్లయింది. సురవరం సుధాకర్ రెడ్డి 1942 మార్చి 25న హైదరాబాద్‌లో జన్మించారు. కర్నూల్‌లోని మున్సిపల్ హైస్కూల్, కోల్స్ మెమోరియల్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేసి, 1964లో కర్నూల్‌లో బీఏ (హిస్టరీ) చదివి, 1967లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీ నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 15 ఏళ్ల వయసులోనే కర్నూల్‌లోని తన స్కూల్‌లో బ్లాక్‌బోర్డులు, చాక్‌పీసులు, పుస్తకాల కోసం ఆందోళనలో కీలక పాత్ర పోషించారు. సుధాకర్ రెడ్డి 1971లో సీపీఐ జాతీయ కౌన్సిల్‌లో చేరారు. 1998లో నల్గొండ నియోజకవర్గం నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై, 2004లో రెండోసారి గెలుపొందారు. 2004లో ఆయన లేబర్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2012 నుంచి 2019 వరకు సీపీఐ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. రైతుల సమస్యలు, కార్మికుల హక్కులు, ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. 2000లో ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనల్లో కీలకంగా వ్యవహరించారు.ఆయన మరణంపై సీపీఐ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సుధాకర్ రెడ్డి మరణంతో కమ్యూనిస్ట్ ఉద్యమం ఒక సీనియర్ నాయకుడిని కోల్పోయిందని సీపీఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు పలువురు నాయకులు సానుభూతి తెలిపారు.





## 'మార్వాడీ హటావో.. తెలంగాణ బచావో'..

**స్వచ్ఛందంగా కొనసాగుతున్న బంద్**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 22(ప్రజాస్వరం):**

మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం పలు వ్యాపారస్తులు ఇబ్రహీంపట్నం కేంద్రంలో సాగర్ హైవే, మంచాల రోడ్డు, పాత బస్టాండ్ రోడ్డులో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ క్రమంలో 'మార్వాడీ హటావో తెలంగాణ బచావో', 'గో బ్యాక్ మార్వాడి.. సేవ్ తెలంగాణ' అంటూ.. నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నార్త్ ఇండియా నుంచి ఇక్కడకు వచ్చి తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మార్వాడీలు అన్ని వ్యాపారాలకు విస్తరిస్తున్నారని, వాళ్ల మనుషులకే ఉద్యోగాలు ఇస్తున్నారని, ప్రజలకు నాసిరకం వస్తువులు అమ్ముతున్నారని పేర్కొన్నారు. మార్వాడీలకు వ్యతిరేకంగా బంద్ కు మద్దతుగా ఇబ్రహీంపట్నంలోని వ్యాపారులైన.. కిరాణా, వస్త్ర,వర్తక,స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ, ఇతర వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు విజయభారతి రాజీనామా

- ప్రభుత్వాల పనితీరుపై అసంతృప్తి కారణంగా నిర్ణయం
- త్వరలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు అధికారికంగా వెల్లడన
- 25న హైదరాబాద్లో జరిగే బీఆర్ఎస్ కార్యక్రమంలో కేసీఆర్, కేటీఆర్ సమక్షంలో జాయిన్
- రైతు బంధు, రుణమాఫీ అమలు లోపాలపై తీవ్ర విమర్శలు
- పార్టీతో ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవని స్పష్టం
- ప్రజా సంక్షేమం సాధన లక్ష్యంగా బీఆర్ఎస్ వైపు అడుగు.
- నిజామాబాద్ జిల్లా, ఆలూర్ మండలానికి చెందిన నేత.
- - గతంలో పార్టీ కోసం విస్తృత స్థాయిలో శ్రమించిన నేతకు కొత్త రాజకీయ ప్రస్థానం ఆరంభం.
- బీజేపీకి రాజీనామా చేసిన రాష్ట్ర కౌన్సిల్ నెంబరు భారతి, బీఆర్ఎస్ పార్టీలోకి అడుగు.

**ఆలూర్, ఆగస్టు 21(ప్రజాస్వరం):** నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ నెంబరు విజయభారతి, పార్టీకి రాజీనామా చేసినట్లు శుక్రవారం మీడియా సమావేశంలో ప్రకటించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, త్వరలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు ఆమె వెల్లడించారు.మీడియాతో మాట్లాడుతూ,, "కేంద్రంలో భారతీయ జనతా పార్టీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీల పాలనల్లో ప్రజలకు, ముఖ్యంగా రైతులకు నిస్సహాయ స్థితి ఏర్పడింది. రైతు బంధు, రుణమాఫీ వంటి పాలసీల విషయంలో ప్రభుత్వం పూర్తి ఆచరణను అవలంబించకపోవడంతో ప్రజలకు సంక్షేమం అందడం లేదన్న భావన కలిగిందన్నారు.ఈ కారణంగానే బీజేపీకి రాజీనామా చేస్తున్నాను," అని స్పష్టం చేశారు.చిరుగుపాటి అభిప్రాయభేదాలు వైపు తిప్పకుండా, పార్టీ అధిష్టాన నాయకులతో తనకేమీ విభేదాలు లేవని విజయభారతి తెలిపారు.అనంతరం, "మిగిలిన పార్టీలతో పోలిస్తే, తెలంగాణ రాష్ట్రంలో గతంలో సీఎం కేసీఆర్ హయాంలో ప్రజా సంక్షేమం అందుబాటులోకి వచ్చింది. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ సాధించుకున్నాం.అని ఇక ప్రజల సంక్షేమాన్ని కూడా సాధించుకోవాలనే ఆశతో నేను బీఆర్ఎస్ పార్టీలో చేరాల్సిన అవసరం వచ్చింది," అని అన్నారు.ఈనెల 25న హైదరాబాద్ బీఆర్ఎస్ భవన్లో జరిగిన భారీ జన సమీకరణ కార్యక్రమంలో, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ సమక్షంలో పార్టీలో అధికారికంగా చేరనున్నట్లు విజయభారతి ప్రకటించారు.గతంలో పార్టీ కోసం శ్రమించిన నాయకురాలు త్వరలో కొత్త రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో మనీష్,రాజారెడ్డి, ఉమ్మెడ చిన్నగంగారెడ్డి,భాస్కర్, మహేందర్,ముత్తెన్న,లింగం,మధు, సవీన్,రజినీ ,సాయిరెడ్డి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.





## కొడుకు, కూతురే కాడెద్దులుగా... ఓ రైతు దయనీయ పరిస్థితి!

- కూలీల ఖర్చు భరించలేక.. పిల్లలతోనే పొలం పని చేయిస్తున్న అన్నదాత
- కూలీల ఖర్చు తలకు మించిన భారమై..
- కన్నబిడ్డలకే కాడి కట్టిన తండ్రి
- మూడు ఎకరాల చామంతి పొలంలో కలుపు తీత
- గిట్టుబాటు ధరపై రైతు తీవ్ర ఆందోళన

**కడప ఆగస్టు 22(ప్రజాస్వరం):**కడప జిల్లాలో ఓ రైతు కూలీలను పెట్టుకునే స్థోమత లేక, తన కన్నబిడ్డలనే కాడికి కట్టి పొలం పనులు చేస్తున్న హృదయ విదారక దృశ్యం పలువురిని కదిలిస్తోంది. వివరాల్లోకి వెళితే, పెండ్లిమర్రి గ్రామానికి చెందిన రైతు బండి శేఖర్ రెడ్డి తనకున్న మూడు ఎకరాల పొలంలో చామంతి పంటను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పొలంలో కలుపు మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. వాటిని తొలగించడానికి కూలీల ఖర్చు తలకు మించిన భారంగా మారింది. దీనికి తోడు, పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లభిస్తుందనే నమ్మకం కూడా లేదు. ఈ ఆర్థిక ఇబ్బందుల నడుమ ఏం చేయాలో పాలుపోని శేఖర్ రెడ్డి, తన కుమారుడు, కుమార్తె సహాయంతోనే కలుపు తీయాలని నిర్ణయించుకున్నాడు. తేలికపాటి కాడిని తన పిల్లలకు కట్టి, వారితోనే కలుపు తీసే యంత్రాన్ని లాగిస్తున్న దృశ్యం అక్కడి వారిని కలచివేసింది. ఈ విషయంపై శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, "పంటకోత సమయానికి గిట్టుబాటు ధర లభిస్తుందో లేదో అనే అనిశ్చితి ఉంది. అందుకే ఈ విధంగా చేయాల్సి వచ్చింది" అని తన ఆవేదనను వెళ్లగక్కారు. ఈ ఘటన క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని కళ్లకు కడుతోంది.



## కలుషిత నీరు తాగి 11 మంది విద్యార్థులకు అస్వస్థత

**భూపాలపల్లి ఆగస్టు 22(ప్రజాస్వరం):**

కలుషిత నీరు తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి అయిన ఘటన జిల్లా కేంద్రంలోని భూపాలపల్లిలో చోటుచేసుకుంది. సుభాష్ కాలనీలోని గాంధీనగర్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం రోజు విద్యార్థులు కలుషిత నీరు తాగడంతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో వీరిని హుటాహుటిన జిల్లాలోని వంద పడకల హాస్పిటల్‌కు తరలించి సరైన చికిత్స అందిస్తున్నారు. ఇక ఈ విషయం తెలుసుకున్న భూపాల్ పల్లి సీఐ నరేష్, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల పరిస్థితిని తెలుసుకున్నారు. కాగా విద్యార్థులకు ఎలాంటి ప్రాణ భయం లేదని వైద్య సిబ్బంది తెలిపారు.

## చేర్యాల నూతన ఎంపిడిఓ గా శ్రీనివాస్

**చేర్యాల, ఆగస్టు 22 (ప్రజాస్వరం)**

చేర్యాల మండల నూతన ఎంపిడిఓ గా చెలుముల శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.. చిలుముల శ్రీనివాస్ ఇంతకుముందు రాయపోల్ మండల ఎంపిఓగా విధులు నిర్వహించి నేడు చేర్యాల ఎంపీడీవో గా వచ్చారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల మండల అభివృద్ధి లో నా వంతు కృషి చేస్తానని, ప్రజలు అధికారులకు అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు..ఈ సందర్భంగా శ్రీనివాస్ కి ఎంపీడీఓ ఆఫీసు లో పనిచేసే ఉద్యోగులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిజేశారు..



# అమ్మాయిని ఈజీగా ఇంప్రెస్ చేసే 9 ట్రిక్స్ ఇవే...

అమ్మాయిలను ఇంప్రెస్ చేయడం ఎలా? అబ్బాయిల మదుల్లో మెదిలే అతిపెద్ద ప్రశ్నల్లో ఒకటి. యుక్తవయసులో ఉన్న కుర్రోళ్లు అమ్మాయిలను ఇంప్రెస్ చేయడానికి నానా తంటాలు పడుతుంటారు. కానీ ఒక్క అమ్మాయిని ఇంప్రెస్ చేయడంలో కూడా తాము సక్సెస్ కాలేకపోతున్నామని బాధపడుతుంటారు. ఈ కష్టకాలకు సొల్యూషన్ కోసం వారు అనేక ప్రయత్నాలు కూడా చేస్తుంటారు. ప్రేమించిన అమ్మాయి మనసులో చోటు దక్కించుకోవడానికి గూగుల్, యూట్యూబ్, ఫ్రెండ్స్ సలహాలు, ఇలా అన్నీ ఫాలో అయిపోతుంటారు. కానీ కొన్ని సార్లు అవి కూడా ఆశించిన ఫలితాలు రావు. అయితే అమ్మాయిల మైండ్ సెట్ పై కొంచెం ఫోకస్ పెడితే పడరాని పాట్లు పడాల్సిన అవసరం లేదు. కామన్ ఇండియన్ విమెన్ మెంటాలిటీ తెలిస్తే వారిని డీల్ చేయడం చాలా ఈజీ. ఇప్పుడు వారిని ఇంప్రెస్ చేసే కొన్ని సులువైన మార్గాలేంటో తెలుసుకుందాం.

**హెయిర్ కట్:**
చక్కగా హెయిర్ కట్ చేసుకుని, గడ్డం ట్రిమ్ చేసుకోండి. మీ జుట్టుపై ఎక్కువ శ్రద్ధ తీసుకుని ఆకర్షణీయంగా ఉండడంతో అమ్మాయి ఇంప్రెస్ అవుతుంది.

**డ్రెస్సింగ్:**
ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ది బెస్ట్ ఇంప్రెషన్ అంటుంటారు. ఆమెని కలవడానికి వెళ్ళినప్పుడు లేదా ఇద్దరూ కలిసి బయటకి వెళుతున్నప్పుడు మంచిగా డ్రెస్ అప్ అవండి. మీకు కంఫర్ట్ ఉండే దుస్తులు ధరించండి.

**వివరాలు తెలుసుకోండి:**
అమ్మాయికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించండి. ఆమె ఇష్టాయిష్టాల గురించి అడగండి. తనకి సంబంధించిన ప్రశ్నలు వేయడంతో ఎక్కువసేపు మీతో మాట్లాడుతుంది.

**పొగడ్త:**
పొగడ్తలంటే నచ్చని మనుషులు చాలా తక్కువ. అమ్మాయి వద్ద కూడా ఆమెలో మీకు నచ్చిన విషయం చెప్పి పొగడండి. అలా అని చెప్పి అబద్ధాలు చెప్తే మొదటికే మోసం రావచ్చు జాగ్రత్త!

**కళ్ళలోకి చూడండి:**
అమ్మాయి మీతో మాట్లాడుతున్నంత సేపు మీరు ఆమె కళ్ళవైపు చూడండి. ఆమె కళ్లవైపు తదేకంగా చూడడంతో వారిలో పాజిటివ్ ఫీల్ కలుగుతుంది. మీకు అట్రాక్ట్ అవుతారు.

**సలహా అడగండి:**
అమ్మాయి నుంచి సలహా తీసుకుంటే తక్కువ అయిపోతామని చాలామంది అబ్బాయిలు భావిస్తుంటారు. కానీ వారి నుండి సలహా తీసుకోవడం వలన వారు ఇంప్రెస్ అవుతారు. అమ్మాయికి పూర్తిగా అవగాహన ఉన్న విషయంలో సలహా తీసుకోవడంతో మీపై ఆమెకు మంచి అభిప్రాయం కలుగుతుంది.

**శ్రద్ధ పెట్టండి:**
అమ్మాయి ఏదైనా విషయం గురించి మాట్లాడుతున్నప్పుడు శ్రద్ధగా వినండి. ఆమె చెప్పేది అనుసరించండి. అనవసరంగా ఆమెను ఇబ్బంది కలిగించవద్దు. ముఖ్యంగా ఫోన్ వాడవద్దు.

**స్నేహితులతో సరదాగా:**
అమ్మాయి స్నేహితులతో సరదాగా గడపండి. వారి ముందు ఆమెను చిన్నబుచ్చే విషయాలు కాకుండా, తనలోని మంచి గుణాల గురించి ప్రస్తావించండి. దీంతో మీపై మంచి అభిప్రాయం వస్తుంది.

**స్వేచ్ఛ ఇవ్వండి:**
డెసిషన్ తీసుకునే విషయంలో అమ్మాయికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వండి. వారు చెప్పే విషయాన్ని శ్రద్ధగా వినండి. వారి అభిప్రాయాన్ని గౌరవించండి.






# వీర్యకణాలు పెరగాలా.. రోజూ ఈ పని చేయండి

ఈరోజుల్లో యువత పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సంపాదన ఉంటేనే సమాజం గౌరవిస్తుండటంతో యుక్త వయసు నుంచే డబ్బు సంపాదనపై శ్రద్ధ పెడుతున్నారు. ఈ క్రమంలో వారు తమ ఆరోగ్యంపై దృష్టిసారించడం లేదు. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యల వల్ల యువకుల దాంపత్య జీవితం కూడా నరకయాతనమవుతోంది. పెళ్ళి చేసుకుని ఏళ్లు గడుస్తున్నా పిల్లలు మాత్రం ఉండటం లేదు. ఏంటా అని డాక్టర్‌ను సంప్రదిస్తే వీర్యకణాల సంఖ్య తగ్గిపోయిందని చెప్తున్నారు. ప్రస్తుత తరం యువతలో స్పెర్మ్ కౌంట్ తగ్గిపోవడం అతిపెద్ద సమస్యగా ఉంది. కొందరు మనిషి ఎంత సౌష్టవంగా వారి శరీరం ఉన్నా ఆరోగ్య సమస్యలు వస్తూనే ఉంటాయి, అంతేకాదు వారికి వీర్యకణాల కౌంట్ చాలా తక్కువగా ఉంటుంది, ఈ సమయంలో చాలామంది సహజంగా మెడిసన్ వాడతారు, ప్రకృతి నుంచి వచ్చే మూలికలు తీసుకుంటారు

అయితే యోగాతో ఆరోగ్యయోగం దక్కుతుందనే విషయం మనకు తెలుసు. కానీ యోగాసనాలతో మన శరీరంలో జన్యుస్థాయిలో మార్పులు జరుగుతాయనే విషయం తెలియదు. క్రమం తప్పకుండా యోగా చేస్తే పురుషుల్లో వీర్యకణాలు పెరుగుతాయని డాక్టర్లు చెబుతున్నారు. పురుషుల్లో వీర్యకణాల సంఖ్య తక్కువగా ఉండటం అనేది దానికి ఓ ముఖ్య కారణం. ప్రస్తుతం ఉన్న చికిత్సలతో దుష్ప్రభావాలూ ఉన్నాయి. వాటికి బదులు.. రోజూ గంటపాటు ప్రాణాయామం, ధ్యానం చేస్తే సహజసిద్ధంగా వీర్యకణాలు వృద్ధిచెందుతాయి అని చెబుతున్నారు వైద్యులు, ఈ విధంగా మీరు ట్రై చేయండి కచ్చితంగా మంచి ఫలితాలు అయితే పొందుతారు.





# ఈ పండు తింటే మీ ఆరోగ్యానికి ఢోకా ఉండదు

ప్రస్తుతం హెల్త్‌పై ప్రతి ఒక్కరికీ శ్రద్ధ పెరుగుతుంది. కరోనా మహిమా అని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటూ తాము తీసుకునే ఆహారం విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బయట ఫుడ్ తినడానికి కూడా చాలా ఆలోచిస్తున్నారు. వీలైనంత వరకు ఆరోగ్యకరమైన ఆహారమే తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనేర చాలా మంది ఫ్రూట్స్ తినడానికి ఆసక్తి చూపుతున్నారు. మరి మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి ఫ్రూట్స్ తినాలో కూడా ఒక అంచనా ఉండాలి. ఈ క్రమంలోనే కివీ ఫ్రూట్స్ తినడం వల్ల మంచి ఆరోగ్యం దక్కుతుందని నిపుణులు చెప్తున్నారు. కాస్తంత ఖరీదైన పండే అయినా.. కివీ తినడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు సూచిస్తున్నారు. ఈ పండును చాలా మంది వండర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. ఈ పండులో నిమ్మ, ఆరెంజ్ తో పోలిస్తే సి విటమిన్ అధికంగా ఉంటుంది. అందుకే ఒంటికి చాలా మంచిది అని చెబుతారు.

మన దేశంలో ఈ పండ్లు పండవు. కివి పండు చూడటానికి చిన్నగా కనిపించినా ఈ పండ్ల వల్ల అనేక ప్రయోజనాలు చేకూరటంతో పాటు పండు ఎంతో రుచిగా ఉంటుంది. ఇక వీటిని సాధారణంగా తీసుకున్నా మిల్క్ షేక్ తో తీసుకున్నా ఆరోగ్యానికి మంచిది. అంతేకాదు ఈ పండు గుజ్జును ఫేస్ మాస్క్ మాదిరిగా ఉపయోగించవచ్చు. ఈ పండు గుజ్జును షాంపూలా ఉపయోగిస్తే జుట్టు సంబంధిత సమస్యలన్నీ దూరమవుతాయి. రోజుకి మీరు ఒక కివీ తీసుకున్నా మీకు గొంతు శ్వాస సంబంధ వ్యాధులు తగ్గుతాయి. ఇది తింటే జీర్ణసమస్యలు కూడా ఉండవు.

**రోగనిరోధక శక్తి**
కివీలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో రోగనిరోధక ప్రతిస్పందనను ప్రేరేపిస్తుంది. ఇది సిఫార్సు చేయబడిన రోజువారీ విటమిన్ సి లో 230 శాతం కలిగి ఉంది. ఈ పండు ప్రతి కొరుకులో రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలతో నిండి ఉంటుంది.

**రక్తపోటు తగ్గింపు**
కివీలో రక్తపోటును తగ్గించే లక్షణాలను కలిగి ఉంది. ఆరోగ్యకరమైన రక్తపోటును నిర్వహించడానికి సహాయపడటం ద్వారా విటమిన్ సి ని అందించడం ద్వారా కివీఫ్రూట్ స్ట్రోక్, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**జీర్ణక్రియ**
కివీలో అధిక మొత్తంలో డైటరీ ఫైబర్ ఉంటుంది. ఫైబర్ మలబద్ధకం, అనేక రకాల జీర్ణశయాంతర సమస్యలు, అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**ఆస్తమాకు కివి**
కివీలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది కొంతమంది ఆస్తమా రోగులలో శ్వాస సంబంధిత లక్షణాలను తగ్గించడంతో సంబంధం కలిగి ఉంది. ఇది ముఖ్యంగా పిల్లలకు వరం.. వారు కివి వినియోగం ద్వారా ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నట్లు కనిపిస్తారు.

**కంటి ఆరోగ్యం**
ఇతర ఆరోగ్యకరమైన విటమిన్, ఖనిజాలతో నిండిన పండ్లు, కూరగాయలతో పాటు తీసుకున్నప్పుడు కివిఫ్రూట్‌లో కనిపించే అధిక స్థాయి యాంటీఆక్సిడెంట్ విటమిన్లు, కెరోటినాయిడ్స్ కంటి వ్యాధిని నివారించడానికి మొత్తం కంటి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి సహాయపడతాయి.





# గ్లింప్స్‌లో చిరు డూప్ అంటు కామెంట్స్..

మెగాస్టార్ చిరంజీవి, ట్యాలెంటేడ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా పై.. చిరు అభిమానుల అంచనాల గురించి ప్రత్యేకంగా చెప్పకర్లేలే. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ విజయానంతరం, అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ ను చాలా కాలం తర్వాత కామెడీ టైమింగ్‌తో చూడబోతున్నాడు. అదేవిధంగా విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటిస్తున్నాడు కాబట్టి, ఈ సినిమా మీద ఆసక్తి మరింత పెరిగింది. ఇక తాజాగా నేడు మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించి టైటిల్ గ్లింప్స్‌ను అధికారికంగా ప్రకటించారు.

చిరంజీవి ఒరిజినల్ పేరు 'శివశంకర వరప్రసాద్' నుంచి స్ఫూర్తి తీసుకొని, 'మన శంకర వరప్రసాద్ గారు పండక్కి వస్తున్నారు' అని టైటిల్‌ను రివిల్ చేశారు. ఈ సందర్భంగా విడుదలైన గ్లింప్స్ వీడియో ఫ్యాన్స్‌లో మిక్స్ రెస్పాన్స్ తెచ్చింది. అయితే చాలా మంది చిరంజీవి స్టైలిష్ లుక్‌ను ఆస్వాదించగా, కొంతమంది మాత్రం 'నేచురల్ లుక్ లేదు, డూప్ వాడినట్లుగా అనిపిస్తోంది" అని కామెంట్ చేశారు. గ్లింప్స్‌లో మెగాస్టార్ నడిచే వింటేజ్ స్టైల్‌ను ఇమిటేట్ చేసినట్టు అనిపించడం వల్ల డివైడ్ రెస్పాన్స్ కూడా వచ్చింది. ఇక ఇలాంటి డిస్కషన్స్ మధ్య, అనిల్ రావిపూడి మీడియా సమావేశంలో స్పష్టత ఇచ్చారు.. "ఈ సినిమాలో ఎలాంటి VFX లేదు. 95 శాతం వరకు చిరంజీవి స్వయంగా నటించారు. ఈ లుక్ కోసం ఆయన చాలా కష్ట పడ్డారు. వర్కౌంట్ లు కూడా చేశారు" అని తెలిపారు. మిగిలిన 5 శాతంలో డూప్ ఉపయోగించారా? అనే చర్చ సోషల్ మీడియాలో నెటిజెన్స్ మధ్య కొనసాగుతోంది. అంతే కాదు గ్లింప్స్ వీడియో కూడా ఆ 5 శాతంలో భాగమా? అనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

# బాలకృష్ణ అంటే ఓ శక్తి.. అఖండ 2 విలన్ ఆది పినిశెట్టి





బాలకృష్ణ అంటే వ్యక్తి కాదని శక్తి అని నటుడు ఆది పినిశెట్టి అన్నారు. బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో పవర్‌ఫుల్‌గా తెరకెక్కుతున్న సినిమా 'అఖండ 2: తాండవం'. సంయుక్త కథానాయిక. ఈ చిత్రంలో ఆది పినిశెట్టి విలన్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. బాలయ్యతో స్క్రీన్ పంచుకోవడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆది మాట్లాడారు.

"తెరపై బాలకృష్ణ ఎలా కనిపిస్తారో నిజ జీవితంలోనూ అలానే ఉంటారు. ఆయన ఒక పవర్‌హౌస్. ఎంతోమందికి స్ఫూర్తి. దృఢ సంకల్పంతో కష్టపడి పని చేస్తారు. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఇక బోయపాటి దర్శకత్వంలో మ్యాజిక్ ఉంది. వీరిద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాలో అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా" అని తెలిపారు. ఈ సినిమాలో విలన్‌గా నటించడం గురించి మాట్లాడుతూ.. "మనందరిలోనూ మంచి, చెడు రెండూ ఉంటాయి. పరిస్థితులను బట్టి పాజిటివ్, నెగెటివ్‌గా ఆలోచిస్తుంటాం. ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండే పాత్రలు చేస్తుంటే ఒక దశ తర్వాత వాటిపై ఆసక్తి ఉండదు. విలన్ పాత్రలకు హద్దు ఉండదు. నటనకు ఎక్కువ ఆస్కారం ఉంటుంది. ప్రతి నాయకుడి పాత్రలు చాలా ఆసక్తిగా ఉంటాయి" అని అన్నారు.

ఇక అఖండ 2 ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇటీవలే బాలయ్య తన పాత్రకు డబ్బింగ్ పూర్తి చేశారు. సీజీ, రీ రికార్డింగ్ పనులు ఒకేసారి జరుగుతున్నాయి. ఆగస్టు చివరికి పనులన్నీ పూర్తిచేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది (Akhanda 2 Latest Update).ఈ సినిమా సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న విషయం తెలిసిందే.



# 'కాక్‌టెయిల్ 2'లో కృతి సనన్ స్పెషల్ ఎంట్రీ!

బాలీవుడ్ ఫ్యాన్స్ కోసం మరో ఎమోషనల్ అప్‌డేట్ రాబోతోంది. 'తేరే ఇష్క మే' సినిమాతో ఇటీవల పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్న కృతి సనన్, ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్ కోసం రెడీ అవుతోంది. రొమాంటిక్ కామెడీ హిట్‌గా నిలిచిన 'కాక్‌టెయిల్'కి సీక్వెల్‌గా రూపొందుతున్న 'కాక్‌టెయిల్ 2'లో కృతి ప్రత్యేక ఎంట్రీ ఇవ్వబోతోంది. హోమి అదజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సీక్వెల్, రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపుదిద్దుకుంటోంది. మొదటి భాగంలో హిట్ సీన్స్, ఎమోషనల్, మ్యూజిక్ ఫ్యాక్టర్ అన్నీ కలిసిపోయి ప్రేక్షకులను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. రెండో భాగంలో, కృతి సనన్ స్పెషల్ ఎంట్రీ, షాహిద్ కపూర్, రష్మిక తో ఉన్న సీన్స్, కథాంశం మరో కొత్త ఎమోషనల్ టచ్ ఇస్తుందని భావిస్తున్నారు.ఈ విషయాన్ని కృతి స్వయంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ ద్వారా తెలియజేసింది.

తన పోస్ట్‌లో "ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ఇక్కడికి చేరుకున్నాన" అని పేర్కొన్నారు. ఈ మాటల ద్వారా ఆమె కెరీర్‌లో ఈ కొత్త అడుగు ఎంత ప్రాముఖ్యమైనదో, ఫ్యాన్స్‌కు ఎంత అద్భుతమైన అనుభూతిని అందించబోతోందో స్పష్టమవుతోంది. ఇక ప్రేక్షకులు ఈ సీక్వెల్ బాక్స్ ఆఫీస్‌లో పెద్ద హిట్ అవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కృతి సనన్, షాహిద్ కపూర్, రష్మిక ముగ్గురు కలిసి ఈ చిత్రాన్ని మరింత హిట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. 'కాక్‌టెయిల్ 2'తో కృతి సనన్ తన స్టార్ పవర్‌ను మరల రీప్రూవ్ చేయనుందనే అంచనాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.




# వాళ్లకు నచ్చకపోతే రామాయణ మూవీ ఫ్లాప్ అయినట్లే: నిర్మాత

ఇండియన్ సినిమాటిక్ చరిత్రలో అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రం 'రామాయణ'. ఇప్పుడు ప్రేక్షకుల దృష్టిలో పెద్ద అంచనాలతో ఉంది. దర్శకుడు నితేష్ తివారీ రూపొందిస్తున్న ఈ రెండు భాగాల పౌరాణిక ఇతిహాసంలో రాణ్‌బీర్ కపూర్ రాముడు, సాయి పల్లవి సీత, యష్ రావణుడు, సన్నీ డియోల్ హనుమాన్, అమితాబ్ బచ్చన్ జటాయువు, రవి దూబే లక్ష్మణుడి పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతం హాన్స్ జిమ్మెర్, ఎ.ఆర్. రెహమాన్ సమకూర్చుతున్నారు. స్టార్ కాస్టింగ్, అత్యాధునిక సాంకేతికత, గ్లోబల్ ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అయితే తాజాగా, నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ మూవీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఆయన మాట్లాడుతూ..

"మేము 'రామాయణ ని కేవలం భారతీయ ప్రేక్షకుల కోసం మాత్రమే చేయడం లేదు. ప్రపంచవ్యాప్తంగా, ప్రతి కుటుంబానికి, ప్రతి ప్రాంతానికి చేరువ అయ్యేలా రూపొందిస్తున్నాం. అయితే పాశ్చాత్య ప్రేక్షకులకు ఇది నచ్చకపోతే, అది నా ఫైల్యూర్ గా భావిస్తా. దర్శకుడు నితేష్ తివారీ కూడా భావోద్వేగాలను స్పష్టంగా ఫీల్ అయ్యేలా సినిమాను రూపొందిస్తున్నారు' అని తెలిపానే. ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ఈ ఇతిహాసానికి కనెక్ట్ అవుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా 'రామాయణ' సినిమా వచ్చే ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది, మరుసటి ఏడాది రెండో భాగం రిలీజ్ అవుతుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999